


1995 సెప్టెంబర్ 1న తొలిసారిగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబు నాయుడు, నేటికి 30 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. నాలుగు సార్లు సీఎంగా రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించిన ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


మంగళవారం 02.09.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 138 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# అసెంబ్లీకి రండి చర్చిద్దాం...

## వైసీపీకి సీఎం సవాల్

**తెలుగు వారికి పెన్షన్ పరిచయం చేసింది ఎన్టీఆరే**

**30 ఏళ్లక్రితమే ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని.. ఏనాడూ విశ్రమించ లేదు**

**కూటమి గెలిచాకే ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది**

**పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా పింఛన్లు పంపిణీ చేసిన సీఎం**

**దోబీ ఘాట్ సందర్శించి రజకులతో ముచ్చటించిన ముఖ్యమంత్రి**

**రాజంపేట(జర్నలిస్ట్ ఫైల్):** ఫేక్ ప్రచారం చేయడం కాదు...అసెంబ్లీకి వచ్చి వివిధ అంశాలపై చర్చించాలని రాజంపేట ప్రజావేదిక నుంచి సీఎం చంద్రబాబు నాయుడు వైసీపీకి సవాల్ విసిరారు. పేదలకు సేవలో కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజంపేట మండలం బోయినపల్లిలో సీఎం పర్యటించారు. కిడ్నీ పనిచేయక మంచానికే పరిమితమైన యడవల్లి సుమిత్రమ్మ ఇంటికి వెళ్లిన ముఖ్యమంత్రి ఆమెకు స్వయంగా పింఛను అందించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అలాగే వివిధ పథకాల లబ్దిదారులతో మాట్లడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక సభలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అసెంబ్లీకి రాకుండా...సోషల్ మీడియాలో, పత్రికా సమావేశాల్లో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న వైసీపీపై ముఖ్యమంత్రి విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... "మొన్నటి వరకూ సిద్ధం, సిద్ధం అంటూ ఎగిరిపడిన 11 మంది వైసీపీ నేతలు అసెంబ్లీలో చర్చకు రావాలి. ఎవరు సంక్షేమం చేశారో, ఎవరు అభివృద్ధి చేశారో తేల్చు కుందాం. ఫేక్ ప్రచారాలతో ఎల్లకాలం ప్రజలను మోసం చేయలేరు. క్లైమోర్ మైన్లతో పేల్చినా చలించని నేను ఎవరికీ భయపడను. సూపర్ సిక్స్ పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు, పెట్టుబడులు మొదలు.. బాబాయ్ హత్య, డోర్ డెలివరీ రాజకీయాలు, కోడి కత్తి డ్రామాలు, గులక రాయి ఎపిసోడ్లు, పులివెందుల-ఒంటిమిట్ట ఎన్నికలు ఇలా దేని పైనైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. వాళ్లు రక్తం పారించిన సీమలో మేం నీరు పారించాం.

మిగతా 2లో...



రాజంపేట నియోజకవర్గం, బోయనపల్లిలో పేదల ఇళ్లకు వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు పింఛను అందించారు. యడవల్లి సుమిత్రమ్మ అనే మహిళకు పింఛను అందించారు. సుమిత్రమ్మ ఆమె ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో దోభీ ఘాట్‌ను సీఎం సందర్శించారు. అక్కడ విధుల్లో ఉన్న రజకులతో కాసేపు ముచ్చటించారు. పనిలో కష్టాలు, సౌకర్యాల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు.

## నేడు విశాఖకు సీఎం

**విశాఖలో ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సదస్సు**

**హాజరు కానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** విశాఖలో జరిగే ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కానున్నారు.

మిగతా 2లో...

## దార్శనికుడు చంద్రబాబు

**ఆంధ్రుల చరిత్రలో ఆధునిక యుగ వైతాళికుడు చంద్రబాబు**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** సుదీర్ఘమైన ఆంధ్రుల చరిత్రలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధునిక యుగ వైతాళికుడు అని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అభివర్ణించారు. చంద్రబాబు మొదటిసారి ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టి 30 సంవత్సరాలు అయిన సందర్భంగా సోమవారం ఒక ప్రకటనలో మంత్రి అభినందనలు తెలిపారు. గత 30 ఏళ్ళల్లో 15 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రి గాను, మరో 15 ఏళ్ళ పాటు ఉమ్మడి, విభజనాంతర రాష్ట్రాల్లో ప్రతిపక్ష నాయకునిగాను చంద్రబాబు తెలుగుజాతి వికాసానికి ఎనలేని సేవలు చేసారని మంత్రి సత్య కుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. తెదేపా వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రతిష్టింప చేస్తే, చంద్రబాబు తెలుగుజాతి ప్రతిభా పాటవాలను విశ్వవ్యాప్తం చేశారని మంత్రి కొనియాడారు. ధార్మికుడైన చంద్రబాబు ప్రపంచ వ్యాప్త పరిణామాలను నిశితంగా పరిశీలించి, మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి తెలుగు యువతను ఆధునిక సాంకేతిక విజ్ఞాన దిశగా నడిపించి నేడు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో వారు ముందంజలో ఉండటానికి కారణభూతులయ్యారని మంత్రి సత్య కుమార్ యాదవ్ గుర్తు చేశారు. పాలనా రంగంలో పెద్ద ఎత్తున సాంకేతిక విజ్ఞాన వినియోగాన్ని ప్రవేశపెట్టి ప్రజలకు మెరుగైన సేవలందించటానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని మంత్రి అన్నారు. పలు రంగాల్లో సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రజోపయోగం కోసం పెను మార్పులకు బాటలు వేసిన ధీశాలి చంద్రబాబు అని మంత్రి సత్య కుమార్ యాదవ్ అభివర్ణించారు. సంక్షేమం, అభివృద్ధి నడుమ ఉన్న అవినావభావ సంబంధాన్ని గుర్తించి ఈ రెండిటి మధ్య సమతులనంతో చంద్రబాబు పాలనకు కొత్త నిర్వచనాన్ని చెప్పారని మంత్రి అన్నారు.

మిగతా 2లో...

## తెలుగు వారి ఆత్మవిశ్వాసం చంద్రబాబు

**సీఎం పదవి చేపట్టి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న చంద్రబాబుకు ఎమ్మెల్సీ ఆలపాటి అభినందనలు**

**ఐటీ విప్లవం నుంచి పోలవరం వరకూ... డ్రిప్ ఇరిగేషన్ నుంచి అమరావతి వరకూ - అన్నీ ప్రజల కోసమే**

**30 ఏళ్ల ప్రస్థానంలో 15 ఏళ్లకు పైగా సీఎంగా నిలవడం ప్రజల విశ్వాసానికి నిదర్శనం**

**చంద్రబాబు 30 ఏళ్ల రాజకీయ ప్రస్థానం - విజనరీ నాయకుడని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందనలు**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు తొలిసారి ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళు పూర్తయిన సందర్భంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1995 సెప్టెంబర్ 1న తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు నాయుడు అప్పటి నుంచి ఇప్పటివరకు నాలుగు సార్లు సీఎంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మహానేత అని పేర్కొన్నారు. మొదటి, రెండో సార్లలో ఎనిమిదేళ్లు ఎనిమిది నెలలు పదమూడు రోజులు సీఎంగా కొనసాగుతూ హైటెక్ సిటీ, సైబరాబాద్, శంషాబాద్ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టుల ద్వారా హైదరాబాద్‌కు కొత్త రూపు ఇచ్చారని గుర్తుచేశారు. నేటి ఆధునిక తెలంగాణకు సాంకేతిక, మౌలిక వసతుల పునాది బాబుగారిదేనని స్పష్టం చేశారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత సీఎం బాధ్యతలు చేపట్టి అమరావతి



రాజధాని రూపకల్పన, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విశాఖను ఆర్థిక%-%ఐటీ రాజధానిగా తీర్చిదిద్దడం, రాయలసీమలో పారిశ్రామిక పెట్టుబడులు వంటి పలు కీలక కార్యక్రమాలను అమలు చేశారని వివరించారు. దేశ రాజకీయాల్లో కింగ్‌మేకర్‌గా తెలుగు ప్రజలకు గౌరవం తెచ్చిన అరుదైన నాయకుడు చంద్రబాబు అని అన్నారు."తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ తెలుగు వారి ఆత్మగౌరవం అయితే... చంద్రబాబు నాయుడు తెలుగు వారి ఆత్మవిశ్వాసం" అని ఆలపాటి బలంగా ఉటంకించారు. కష్టకాలాల్లోనూ పార్టీని బలపరిచి, ప్రజలకు ధైర్యం నింపిన చరిత్ర ఆయనదేనని చెప్పారు. 30 ఏళ్ల ప్రస్థానంలో 15 సంవత్సరాలకు పైగా సీఎంగా కొనసాగడం విశిష్టమైన రికార్డు అని, ఇంతకాలం ప్రజల విశ్వాసం నిలబెట్టుకోవడం ఆయన నాయకత్వ ప్రతిభకు నిదర్శనమని ఆలపాటి అన్నారు."నాడు హైటెక్ సిటీ రూపకల్పన చేసిన చంద్రబాబు, నేడు అమరావతిలో క్వాంటం వ్యాలీకి రూపరేఖలు వేస్తూ కొత్త తరం అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. నాడు సాఫ్ట్వేర్ రంగానికి శ్రీకారం చుట్టిన బాబుగారు, నేడు ఏఐను అందిపుచ్చుకోవడం ఆయన ప్రత్యేకత" అని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందనలు తెలిపారు.

## అఫ్ఘాన్‌లో భూకంప విలయం..

## 800 మందికి పైగా మృతి



**అఫ్ఘానిస్థాన్:** అఫ్ఘానిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించింది. పాకిస్థాన్ సరిహద్దులోని కునార్ ప్రావిన్స్‌లో రిక్టర్ స్కేల్‌పై 6.0 తీవ్రత నమోదైంది. ఈ ఘోర విపత్తు కారణంగా 800 మందికి పైగా మరణించినట్లు ఆ దేశ అధికారిక మీడియా సంస్థ రేడియో టెలివిజన్ అఫ్ఘానిస్థాన్ వెల్లడించింది. మరో 2500 మంది వరకు గాయపడినట్లు తెలిపింది.
యూఎస్ జియోలాజికల్ సర్వే వివరాల ప్రకారం.. నంగర్హార్ ప్రావిన్స్‌లోని జలాలాబాద్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడైంది. 8 కిలోమీటర్ల లోతులో అది కేంద్రీకృతమై ఉంది. ఆదివారం అర్ధరాత్రి 11.47 గంటల ప్రాంతంలో భూకంపం సంభవించినట్లు అధికారులు తెలిపారు. ఘోర విపత్తు కారణంగా కునార్ ప్రావిన్స్ తీవ్రంగా ప్రభావితమైనట్లు సమాచారం. భూకంప తీవ్రతకు సంబంధించిన పలు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. బాధితులకు అత్యవసర సహాయం అవసరమని పలువురు పోస్టులు పెడుతున్నారు.

మిగతా 2లో...

**భావనపాడు ఫిషింగ్ హార్బర్ కల సాకరానికి కృషి చేస్తాం**

**ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం**

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

## మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తాం

**శ్రీకాకుళం, (జర్నలిస్ట్ ఫైల్):** భావనపాడు ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి చిత్తశుద్ధి, అంకిత భావంతో కృషిచేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సంతబొమ్మాళి మండలం మత్స్యకార గ్రామమైన భావనపాడులో పేదల సేవలో భాగంగా మత్స్యకార, దివ్యాంగులు, సామాజిక పింఛన్లు, క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలిసి మంత్రి చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడు తూ మత్స్యకారుల ఉపాధి, జీవనోపాధి పెంపొందించేందుకు చిరకాల



స్వప్నమైన భావనపాడు షిప్పింగ్ హార్బర్ నిర్మాణానికి అంకిత భావంతో కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే పేదలకు ఇచ్చిన హామీ మేరకు రెండు నెలల ముందు నుంచి పెంచిన పింఛన్ ను అందజేసినట్లు గుర్తు చేశారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారుల జీవన భృతి కి 20వేల రూపాయలను మత్స్యకారులకు అందజేసినట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్క దివ్యాంగులకు పింఛన్ ను రద్దు చేయలేదని స్పష్టం చేశారు. జిల్లాలో నకిలీ అంగవైకల్య పత్రాలతో పింఛన్లు పొందుతున్నట్లు గుర్తించి 90 మంది వరకు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. అర్హత ఉన్నట్లు అప్పిల్ చేసుకుని నిరూపిస్తే తక్షణమే దివ్యాంగుల పింఛన్లను మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో అనర్హులకు పింఛన్లు మంజూరు చేసి పింఛన్ల వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని ధ్వజమెత్తారు. 2019 తర్వాత చాలామంది అర్హత ఉన్న పింఛన్లను తొలగించారని ఆర్థిక పరిస్థితులను బట్టి తిరిగి పింఛన్లు మంజూరు చేస్తామని హామీ

3లో...

## నెలాఖరుకు ఫలితాలు విడుదల



**పరీక్షలు నిర్వహించిన అన్ని ఫలితాలు నెలాఖరకు విడుదల**

**ఓఎమ్మార్ షీట్‌ను అభ్యర్థులు సక్రమంగా పూర్తి చేయాలి**

**కోర్టుల్లో కేసుల పెండింగ్ వల్ల డిప్యూటీ ఈవో, ఎఫ్ఆర్వో ఫలితాలు ఆలస్యం**

**వివాదాల పరిష్కారం అయిన వెంటనే ఫలితాలు విడుదల చేస్తాం**

**పి. రాజాబాబు, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి**

మిగతా 2లో...

## 'ఓట్ల చోరీ'పై హైడ్రోజన్ బాంబు పేలుస్తాం



**పట్నా (జర్నలిస్ట్ ఫైల్):** ఓట్ల చోరీ విషయంలో ఇటీవల అణుబాంబు పేల్చామని.. త్వరలోనే మరింత శక్తిమంతమైన హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దీని తర్వాత ప్రధాని మోదీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటారన్నారు. 'ఓటర్ అధికార్ యాత్ర ముగింపు సందర్భంగా పట్నాలో నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ ఈ మేరకు ప్రసంగించారు.

మిగతా 2లో...

## భారత్ ఇప్పటికే ఆలస్యం చేసింది



**అమెరికా :** భారత్‌పై విధించిన అధిక సుంకాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమర్థించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అమెరికా యంత్రాంగం భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ఇప్పటికే ఆధారాలు లేని ఆరోపణలు

మిగతా 2లో...




## బంగాళాఖాతంలో అల్పపీడనం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఈశాన్య బంగాళాఖాతం మరియు దానికి ఆనుకుని ఉన్న మయన్మార్ తీరం మీదుగా ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తులో విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో రానున్న 24గంటల్లో లిఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి 40-50 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని సూచించారు.

మిగతా 2లో...

# నేడు విశాఖకు సీఎం



(మొదటి పేజీ తరువాయి)

గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సులో కీలకమైన అంశాలపై చర్చించనున్నారు. నేడు మద్యాహ్నం 2.30 గంటలకు విశాఖలోని నోవోటెల్ హోటల్ లో ఈ సదస్సుకు హాజరవుతారు. మారిటైమ్ లాజిస్టిక్స్ పై దృష్టి సారించేలా 20 కంపెనీలకు చెందిన సీఈఓలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. అలాగే మారి టైమ్ రంగంలోని ఆరు స్టార్టప్ లతోనూ సీఎం చంద్రబాబు మాట్లాడనున్నారు. బ్లర్గ్స్ ఏఐ, డాకర్ విజన్ , ఓల్టియో మారిటైమ్, ఆటోమాక్సిస్, ఈజీలేన్, ఎయిమ్ లోకేట్ తదితర స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో సీఎం సంభాషించనున్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలలో భాగంగా ఏపీని గ్లోబల్ లాజిస్టిక్స్ హబ్ గా తీర్చిదిద్దే అంశంపై ముఖ్యమంత్రి పారిశ్రామిక ప్రతినిధులతో చర్చించనున్నారు. వారి నుంచి సూచనలు సలహాలు తీసుకోనున్నారు. ఈ అంశంపై నిర్వహించనున్న ప్లీనరీ సెషన్ పాల్గోనున్న సీఎం ఏపీ మారి టైమ్ బోర్డు, జీఎఫ్ఎస్టీ సంయుక్తంగా రూపొందించిన వ్యూహాత్మక పత్రాలను విడుదల చేయనున్నారు. అలాగే ఎయిర్ కార్గో ఫోరమ్ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ ను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ సమావేశానికి జీఎఫ్ఎస్టీ ఉపాధ్యక్షుడు ఎస్.పి.టక్కర్, ఏపీ మారి టైమ్ బోర్డు అధికారులు, లాజిస్టిక్స్ రంగానికి చెందిన వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారు.

# అఫ్గాన్‌లో భూకంప విలయం..



(మొదటి పేజీ తరువాయి)

భూకంపం కారణంగా పలు గ్రామాల్లోని ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయని వార్దక్ ప్రావిన్స్ మాజీ మేయర్ జరీఫా ఘఫ్ఫారీ పోస్టు పెట్టారు. ఈ విపత్తు ధాటికి పలు కుటుంబాలు కకావికలమైనట్లు పేర్కొన్నారు. 'అఫ్గానిస్థాన్‌లోని కునార్, నోరిస్థాన్, నంగర్హార్ ప్రావిన్స్‌లు భూకంపం కారణంగా తీవ్రంగా నష్టపోయాయి. ఇళ్లు కూలిపోవడంతో పలు కుటుంబాలు వీధిన పడ్డాయి. వారి జీవితం అగమ్యగోచరంగా మారింది. గ్రామాల్లోని మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర గాయాలపాలై ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. బాధితుల పరిస్థితి దుర్భరంగా ఉంది. అసమర్థ తాలిబన్ ప్రభుత్వం ఈ విపత్తును ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా లేదు. ఈ సమయంలో కునార్ ప్రజలకు సాయం అత్యవసరం. అంతర్జాతీయ సమాజం, మానవతా సంస్థలు సత్వరమే స్పందించి బాధితులను ఆదుకోవాలి. అవసరమైన ఆహారం అందించి.. ఆశ్రయం కల్పించాలి. ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేయాలి' అని పోస్టులో పేర్కొన్నారు.

భూకంపం కారణంగా పలువురు మరణించారనే వార్త విని తాను చలించిపోయానని క్రికెటర్ రహ్మానుల్లా గుర్బాజ్ పోస్టు పెట్టారు. బాధితుల కుటుంబం కోసం ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులు సమీపంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని అంతకుముందు ఓ అధికారి తెలిపారు. 20 నిమిషాల వ్యవధి తర్వాత 4.5 తీవ్రతతో మరో భూకంపం వచ్చినట్లు పేర్కొన్నారు.

**అఫ్గాన్‌ను అన్ని రకాలుగా ఆదుకుంటాం: ప్రధాని మోదీ :** అఫ్గానిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించంతో వందలమంది ప్రజలు ప్రాణాలు కోల్పోవడంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విపత్తులో కుటుంబసభ్యులను, సన్నిహితులను కోల్పోయిన వారికి తగిన శక్తినివ్వాలని.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. భూకంపం ధాటికి నష్టపోయిన అఫ్గాన్‌కు అన్ని రకాల మనవతా సాయం అందించి.. ఆ దేశాన్ని ఆదుకునేందుకు భారత్ సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.

# దార్శనికుడు చంద్రబాబు



(మొదటి పేజీ తరువాయి)

యస్.సి, యస్.టి, బిసి, మైనారిటీ, మహిళ, యువత మరియు రైతు వర్గాల సాధికారత కోసం చంద్రబాబు పలు పథకాలు రూపొందించి సత్ఫలితాలు సాధించారని మంత్రి సత్య కుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. తెలుగు యువతకు కలలు కనటం నేర్పటంతో పాటు, వారు ఆ కలల సాధనకు అనుసరించాల్సిన మార్గాలను కూడా చంద్రబాబు చూపారని, సాంప్రదాయ రంగాలతో పాటు ఆధునిక రంగాల వికాసానికి బాటలు వేస్తూ, ప్రపంచ సమకాలీన పరిణామాలకు అనుగుణంగా ఆధునిక భావజాలంతో తెలుగుజాతి ప్రగతికి బాటలు వేసిన ఆధునిక యుగ వైతాళికుడు నారా చంద్రబాబునాయుడు అని మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తూ తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల కోసం చంద్రబాబు ఇతోధికంగా కృషి చేశారని మంత్రి గుర్తు చేశారు. నారా చంద్రబాబునాయుడు మొదటిసారిగా సెప్టెంబరు 1, 1995న అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

# భారత్ ఇప్పటికే ఆలస్యం చేసింది



(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్ మరోసారి సుంకాలపై వ్యాఖ్యలు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ- రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ ముగిసిన కొన్ని గంటల సమయంలోనే ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. భారత్‌తో వాణిజ్యం పూర్తిగా ఏకపక్ష విపత్తు అని పేర్కొన్నారు. అధిక సుంకాల కారణంగా భారత్‌కు అమెరికా వస్తువులను విక్రయించలేకపోతోందని ఆరోపించారు. అమెరికా వస్తువులపై దిగుమతి సుంకాలను సున్నాకు తగ్గించేందుకు భారత్ ముందుకు వచ్చిందని ట్రంప్ అన్నారు. అయితే.. అది ఆలస్యమవుతోందని పేర్కొన్నారు. వారు కొన్నేళ్ల క్రితమే అలా చేసి ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. మోదీ-పుతిన్ భేటీ నేపథ్యంలో ట్రంప్ నుంచి ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హం. అమెరికాకు భారత్ ఎక్కువ వస్తువులు విక్రయించి.. తక్కువ కొనుగోలు చేస్తుందన్నారు. ఏ దేశంపై వేయనంత సుంకాలను భారత్ అమెరికాపై వేసిందని చెప్పారు. సుంకాలు తగ్గిస్తామని భారత్ ఇప్పుడు ప్రతిపాదిస్తోందని, కానీ, ఇప్పటికే ఆలస్యమైందని ట్రంప్ అన్నారు.

# అసెంబ్లీకి రండి చర్చిద్దాం..







(మొదటి పేజీ తరువాయి)

సీమలో ఫ్యాక్షన్ మాట వినపడకుండా చేశాం. రాష్ట్రంలో రౌడీ అన్న వాడు లేకుండా చేశాం. సొంత కార్యకర్తను కారుతో తొక్కించి.. నెపాన్ని మా మీద వేశారు. మామిడి కాయలు రోడ్డుపై తొక్కించి డ్రామాలాడిన వ్యక్తులు మమ్మల్ని విమర్శిస్తున్నారు. మహిళలపై సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించి ఆడబిడ్డలకు భద్రత కల్పిస్తాం." అని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పింఛన్ల పంపిణీ దానం కాదు...బాధ్యత:** "పింఛన్ల పంపిణీ దానమో, ధర్మమో కాదు. అది ప్రభుత్వాల బాధ్యత. ప్రతి నెలా పింఛన్ల పంపిణీ పండుగా జరుగుతోంది. గత ప్రభుత్వంలో జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి చూశాం. ఇప్పుడు లక్షా 65 వేల మంది అధికారులు కేవలం 3 గంటల్లో పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా ఎన్డీఏ ప్రభుత్వం పేదలకు పింఛన్లు అందిస్తోంది. ఇప్పటి వరకూ దాదాపు రూ.42 వేల కోట్లు కేవలం పెన్షన్ల కోసం ఖర్చు చేశాం. ఈ సెప్టెంబర్ నెలలోనే పింఛన్ల కింద 63,61,380 మందికి రూ.2,747 కోట్లు వెచ్చించాం. 1983లో ఎన్టీఆర్ రూ. 30తో పేదలకు పింఛనుకు శ్రీకారం చుట్టారు. నేను 1995లో ముఖ్యమంత్రి అయ్యాక పెన్షన్ ను రూ. 75కు పెంచాను. 2014 నాటికి రూ.200 ఉన్న పింఛన్‌ను మళ్లీ ఒకేసారి రూ.1,000కి పెంచాం. దివ్యాంగులకు రూ.1500 చేశాం. మళ్లీ 2018లో వృద్ధాప్య, వితంతు పెన్షన్‌ను రూ.2,000లకు, దివ్యాంగులకు రూ.3,000 చేశాం. ఐదేళ్లలో పింఛన్లు 10 రెట్లు, దివ్యాంగులకు 12 రెట్లు పెంచిన పార్టీ తెలుగుదేశం." అని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

**ఫేక్ పార్టీ-ఫేక్ పింఛన్లు :** "గత ప్రభుత్వంలో అవయవాలు సక్రమంగా ఉన్నవారికి కూడా పింఛన్లు మంజూరు చేశారు. వారి పార్టీ కార్యకర్తలకు ప్రజల సంపదను దోచిపెట్టారు. ప్రభుత్వ ధనం దోపిడీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలో వద్దో ప్రజలే చెప్పాలి. భర్త చనిపోతే భార్యకు పింఛను ఇవ్వని గత పాలకులు విమర్శలు చేస్తున్నారు. అర్హులకు మాత్రమే చెందాల్సిన సంక్షేమం.. అనర్హులకు ఇవ్వొచ్చా? వైసీపీ తీరును ప్రజలు గమనించాలి. తప్పును తప్పు అనే చెప్పే ధైర్యం ప్రజలకు రావాలి. మంచికి అండగా నిలబడాలి. అప్పుడే మాకు మరింత బలం చేకూరుతుంది. ప్రజలే నా బలం...బలగం. వారి కోసం మరింత సంక్షేమాన్ని అందిస్తాం. కూటమి ప్రభుత్వం రాగానే భర్త చనిపోయిన నెలలోనే పింఛన్లు అందిస్తున్నాం. ఈ నెలలో రూ.3.14 కోట్లతో కొత్తగా 7,872 మందికి వితంతు పింఛన్లు ఇస్తున్నాం. రాష్ట్రంలో మొత్తం 8,10,182 మంది దివ్యాంగ పింఛన్లు, మెడికల్ పింఛన్లు ఇస్తున్నాం. దివ్యాంగులకు ఇస్తున్న రూ.6 వేలల్లో రూ.5,550 పెంచింది తెలుగు దేశం ప్రభుత్వాలే. 2 నెలలుగా పింఛను తీసుకోని 1,20,187 మందికి రూ.101 కోట్లు, 3 నెలలుగా పెన్షన్ తీసుకోని 11,986 మందికి రూ.15 కోట్లు అందించడం ప్రజా సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం." అని ముఖ్యమంత్రి అన్నారు.

**ప్రజలకు నిలదీసే స్వేచ్ఛను ఇచ్చాం :** రాష్ట్ర పునర్నిర్మాణం కోసం బీజేపీ, జనసేనతో కలిసి పోటీ చేస్తే ప్రజలు చారిత్రాత్మక విజయం కట్టబెట్టారు. రాష్ట్ర విభజన తర్వాత కొన్ని ఇబ్బందులు వచ్చాయి. 2014-19లో దేశంలో ఎక్కడాలేని అభివృద్ధి మన రాష్ట్రంలో చేశాం. 2019 నుంచి గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. ఐదేళ్లు ప్రజల మోహాల్లో నవ్వులు లేవు. ఏం మాట్లాడలేని పరిస్థితి. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాకే ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. ఎమ్మెల్యేలు అయినా సరే...తప్పు చేశారని భావిస్తే...నిలదీయొచ్చు. ఇదే తరహాలో ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి. మంచి ప్రభుత్వానికి అండగా నిలవాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు మించే సంక్షేమం అందిస్తున్నాం. 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీ నిర్వహించాం. ఎంతమంది పిల్లలున్నా.. తల్లికి వందనం ఇచ్చాం. అన్న క్యాంటీన్, అన్నదాత సుఖీభవ అమలు చేశాం. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. చేనేతలకు ఉచిత విద్యుత్, మత్స్యకారుల సేవలో భాగంగా వేట విరామ సమయంలో రూ.20 వేలు, నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేలకు వేతనాలు పెంపు, 40వేలకు పైగా సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. సన్న బియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, రోడ్లపై గుంతలు పూడ్చుతున్నాం. రైతులకు 90 శాతం సబ్సీడీతో డ్రిప్ ఇస్తున్నాం." అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**ప్రజా సేవే నా లక్ష్యం:** "సరిగ్గా 30 ఏళ్ల క్రితం ఇదే రోజున నేను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాను. ఈ కాలంలో నేను ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. అయినా వెనకడుగు వేయలేదు. సమైక్యాంధ్రలో ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా, విపక్షనేతగా పని చేశాను. సంపద సృష్టించి, ప్రజలకు సంక్షేమం అందించాననే తృప్తి నాకు ఉంది. రాజంపేటలో నేను కట్టిన దోబీ ఘాట్లు చూసి ఆనందించాను. 25 ఏళ్ల క్రితం ఈ ఘాట్లు నేను కట్టినవే అని వారు చెబితే సంతోషం వేసింది. ఈ 30 ఏళ్లలో ఏనాడు నేను విశ్రమించ లేదు. నిద్ర లేచింది మొదలు మిషన్ తరహాలో పనిచేస్తాను. తెలుగు జాతి అగ్రస్థానంలో ఉందంటే అందుకు టీడీపీనే కారణం. నాడు హైదరాబాద్ అభివృద్ధిలో భాగస్వాములం అయ్యాం. నేడు అమరావతి నిర్మాణం చేసే అవకాశం ప్రజలు ఇచ్చారు. ఆవిర్భావం నుంచి పార్టీ వెన్నంటే ఉన్న బీసీల రుణం తీర్చు కోలేనిది. అనునిత్యం ప్రజా సేవలోనే ఉన్నాను. పేదల జీవితాల్లో వెలుగులు నింపి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నా." అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**రాళ్లసీమను రతనాల సీమ చేస్తున్నాం :** "రాళ్ల సీమగా మారుతుందనుకున్న రాయలసీమను రతనాలసీమ చేస్తున్నాం. సీమలో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చాం. కరెంటు లేని పరిస్థితి నుంచి ఇంటిపైనే సౌర విద్యుత్ తయారు చేసే పరిస్థితి తెచ్చాం. పేదరికం నిర్మూలన కోసం వెలుగు తీసుకొచ్చాను. డ్వాక్రా, సాగునీటి, సహకార సంఘాలు ఏర్పాటు చేశాం. చెప్పినట్టే సీమకు కృష్ణా జలాలు తెచ్చాం. సీమ అభివృద్ధికి బ్లూ ప్రింట్ అమలు చేస్తున్నాం. కియాతో అనంతపురం జిల్లా రూపురేఖలు మార్చేశాం. రాబోయే రోజుల్లో ఆటోమొబైల్, ఎలక్ట్రికల్, స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్ రంగాలకు సీమను హబ్ చేశాం. గోదావరి నుంచి నీరు వృథాగా సముద్రంలోకి పోతుంటే సీమలో నీటి కోసం ఇబ్బందులు వస్తున్నాయి. వంశధార నుంచి గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం చేస్తాం." అని చంద్రబాబు వెల్లడించారు.

**జిల్లాల విభజన సమస్యను పరిష్కరిస్తాం :** "రాజంపేటను అభివృద్ధిలో ముందుకు తీసుకెళతాం. జిల్లాల విభజనలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. వాటిని సరి చేస్తాం. రాజంపేట నియోజకవర్గం ప్రజలు ఎన్నికల్లో మాకు ఓటేయలేదు. కొన్ని కారణాల వల్ల రాజంపేట ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు రాలేదు. అయినప్పటికీ రాజకీయాలు వేరు, అభివృద్ధి వేరు. కూటమిని ఓడించారు. గెలిచిన వారిని చూసుకోవాలి... వారి సమస్యలు తీర్చాలి. అయినా రాజకీయాన్ని అభివృద్ధితో ముడిపెట్టను... అభివృద్ధి చేస్తాను. 2014లో టీడీపీ ప్రభుత్వమే ఒంటిమిట్ట శ్రీరాముడి ఆలయాన్ని అభివృద్ధి చేసింది. రాజంపేటకు మెడికల్ కాలేజీ కావాలని అడిగారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటాం. ప్రజలు అందరికీ సంక్షేమం అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పాలన చేస్తోంది. పీ4తో పేదరిక నిర్మూలన సాధ్యం చేసి చూపిస్తాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

**దోబీ ఘాట్ సందర్శన... షెడ్లు నిర్మించాలని ఆదేశం :** బోయనపల్లిలో దోబీ ఘాట్ ను ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై రజకులను అడిగి తెలుసుకున్నారు. దోబీ ఘాట్లలో షెడ్లు నిర్మించాలని రజకులు కోరగా వెంటనే తగిన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే దోబీ ఘాట్ కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులున్నా... అధికారులకు తెలియచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సహా జిల్లా ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నెలాఖరుకు ఫలితాలు విడుదల




**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్):** అభ్యర్థులు పరీక్ష హాల్లో ఓఎమ్మార్ షీట్ లో చేసే చిన్న, చిన్న పొరపాట్లే వారి జీవితాలను తారుమారు చేస్తాయనే విషయాన్ని తెలుసుకుని ఓఎమ్మార్ షీట్ ను సక్రమంగా పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి పి. రాజాబాబు తెలిపారు. ఏపీపీఎస్సీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కమిషన్ కార్యదర్శి పి. రాజాబాబు మాట్లాడుతూ అభ్యర్థులు పరీక్ష హాల్లో ఏ చిన్న తప్పు చేసినా వారి శ్రమ వృధా అవుతుందని, లక్షల మంది పరీక్ష రాస్తున్నారనే విషయం గుర్తించుకోవాలన్నారు. ఈ నెల 7 వ తేదీన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ మరియు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు పరీక్ష నిర్వహించనున్నామన్నారు. అభ్యర్థులకు ఏబీసీడీ సిరీస్ లలో ఏదో ఒకదాన్ని ఎంపిక చేసిన ప్రశ్నాపత్రం అందిస్తామన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా ఓఎమ్ఆర్ షీట్ ను జాగ్రత్తగా నింపాల్సి ఉందన్నారు. అభ్యర్థులు తప్పులు చేస్తే ఓఎమ్ఆర్ షీట్ ఇన్ వాలిడ్ అవుతుందని, దిద్దినా, కొట్టివేసినా, గోళ్లతో చెరిపివేసినా, వైట్ నర్ పెట్టినా ట్యాంపరింగ్ అయినట్లు ఏపీపీఎస్సీ భావిస్తుందన్నారు. ట్యాంపరింగ్ చేసిన ఓఎమ్ఆర్ షీట్లను పరిగణలోనికి తీసుకోవడం జరగదన్నారు. ఏపీపీఎస్సీ నిర్వహించే ఆయా పరీక్షల్లో అభ్యర్థులు ఏవిధమైన పొరపాట్లు లేకుండా ఓఎమ్మార్ షీట్ ను పూర్తి చేయాలని, ఎక్కువ మంది ఓఎమ్మార్ షీట్స్ లలో పొరపాట్లు చేస్తున్నారన్నారు. ఓఎమ్మార్ షీట్స్ పూర్తి చేయటానికి బ్లాక్ లేదా బ్లూ పెన్స్ ను ఉపయోగించి మాత్రమే పూర్తి చేయాలన్నారు. ఫారెస్ట్ ఉద్యోగాల పరీక్ష ల్లో 1/3 నెగెటివ్ మార్కులు ఉన్నాయి కాభట్టి అభ్యర్థులు జాగ్రత్తగా ఆలోచించి సమాధానాలు ఆయా వృత్తాల్లో నింపాలన్నారు. గ్రూప్-1, గ్రూపు-2 పరీక్షలకు సంబంధించిన కోర్టు సమస్య పరిష్కారం కాగానే ఫలితాలు వెల్లడిస్తామన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరీక్షలు నిర్వహించడం జరిగిందని, క్వాలిఫికేషన్ కు సంబంధించి వివాదం పరిష్కారం కాగానే ఫలితాలు వెల్లడిస్తామన్నారు. కోర్టుల్లో కేసుల పెండింగ్ వల్ల డిప్యూటీ ఈవో, ఎఫ్ఆర్వో ఫలితాలు ఆలస్యం అవుతున్నాయన్నారు. ఇప్పటి వరకు 1600 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ వివిధ నోటిఫికేషన్లు ఇచ్చిందన్నారు. ఈ నెలాఖరుకు వివిధ పోస్టుల భర్తీకి సంబంధించి మరో 16 నోటిఫికేషన్లు ఇవ్వాల్సి ఉందన్నారు. పారదర్శకంగా వాల్యుయేషన్ పూర్తి చేసి ఫలితాలు విడుదల చేస్తామన్నారు. కోర్టుల్లో కేసుల ఉండటం వల్ల పరీక్షా ఫలితాలు ప్రకటించటం ఆలస్యం అవుతుందన్నారు.

సోషల్ మీడియాలో ఏపీపీఎస్సీ పై తప్పుడు సమాచారాన్ని అందిస్తున్నారని, అది కరెక్ట్ కాదన్నారు. మహిళా రిజర్వేషన్ (హారిజాంటల్) కు సంబంధించి వివాదం వల్ల కొన్ని పోస్టుల ఫలితాలు సిద్ధంగా ఉన్నా ప్రకటించలేకపోతున్నామని కార్యదర్శి రాజబాబు తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ అడిషనల్ సెక్రటరీ ఐఎన్. మూర్తి, జాయింట్ సెక్రటరీ లు కేవీ ప్రసాద్, జీకే ప్రసూన లు పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం



(మొదటి పేజీ తరువాయి)

రేపు విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 5 గంటల నాటికి విజయనగరం జిల్లా గుర్లలో 76.7మిమీ, శ్రీకాకుళం జిల్లా లావేరు 65.5మిమీ, మన్యం జిల్లా జియమ్మవలసలో 63.7మిమీ, విజయనగరం పెద్దనడిపల్లిలో 61.5మిమీ, అనకాపల్లి జిల్లా నరసింగపల్లిలో 60మిమీ చొప్పున వర్షపాతం రికార్డ్ అయిందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి వరద నీటిమట్టం 44.4 అడుగులు ఉందన్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజి వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 11.91 లక్షల క్యూసెక్కులు ఉందని మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందన్నారు. కృష్ణానది ప్రకాశం బ్యారేజి వద్ద సాయంత్రం 5 గంటలకు ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 3.42 లక్షల క్యూసెక్కులు ఉందని, దాదాపు మొదటి హెచ్చరిక స్థాయి వరకు వరద ప్రవాహం చేరే అవకాశం ఉందన్నారు.

కృష్ణా, గోదావరి నదుల వరద ప్రవాహం పూర్తిగా తగ్గే వరకు పొంగిపొర్లే నదులు, వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు.

# 'ఓట్ల చోరీ'పై హైడ్రోజన్ బాంబు పేలుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

"రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు భాజపా కు అనుమతించబోం. అందుకే ఈ యాత్ర నిర్వహించాం. దీనికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. మహారాష్ట్రలో, కర్ణాటకలో ఓట్ల చోరీ జరిగిందని ఆధారాలు సహా చూపించాం. ఓట్ల చోరీ అంటే.. హక్కుల చోరీ, ప్రజాస్వామ్య చోరీ, ఉపాధి చోరీ అన్నట్లే. ఈ వ్యవహారంలో త్వరలోనే హైడ్రోజన్ బాంబు పేల్చనున్నాం" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

'ఓటరు అధికార్ యాత్ర' ముగింపు సందర్భంగా 'ఇండియా' కూటమి నేతలు పట్నాలో నిర్వహించిన 'గాంధీ సే అంబేడ్కర్' మార్చ్‌ను పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకున్నారు. దీంతో నేతలు అక్కడే ప్రసంగించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ ఓట్ల చోరీ ద్వారా గెలవడానికి యత్నిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఓడిపోతుందన్నారు.

బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికల వేళ.. రాహుల్ గాంధీ 'ఓటరు అధికార్ యాత్ర' చేపట్టారు. ఆగస్టు 17న ససారాంలో మొదలైన ఈ యాత్ర.. 25 జిల్లాల్లోని 110 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 1,300 కి.మీ. మేర కొనసాగింది. బిహార్‌లో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' ప్రక్రియ మొదలు మహిళా, రైతు సమస్యలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పారిశ్రామికాభివృద్ధి వంటి అంశాలను లేవనెత్తుతూ స్థానికులకు చేరువయ్యే ప్రయత్నం చేశారు.

**రాహుల్ వ్యాఖ్యలను ఖండించిన భాజపా..**

రాహుల్ గాంధీ వ్యాఖ్యలు తనను తాను కించపరచుకోవడమే కాకుండా ఓటర్లను అవమానించేలా ఉన్నాయని భాజపా మండిపడింది. "రాహుల్ గాంధీ ఎక్కడ మాట్లాడినా.. ఆయన ఏం చెప్పాలనుకుంటున్నారో అర్థం చేసుకునేందుకు సమయం పడుతుంది. ఇప్పుడు అణుబాంబు, హైడ్రోజన్ బాంబు అంటున్నారు. అసలు ఎన్నికలకు వీటికి ఏం సంబంధం? ఆయన బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు" అని కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

# ఆరుగురు ప్రొఫెసర్లకు పదోన్నతి

## 321 మంది సెకండరీ ఆసుపత్రుల వైద్యులకు ప్రమోషన్లు

## గతేడాది కాలంలో 600 మంది ప్రభుత్వ వైద్యులకు ప్రమోషన్లు




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆగష్టు 31తో ముగిసిన 2024-25 ప్యానల్ సంవత్సరంలో ప్రభుత్వ వైద్యులకు వైద్యారోగ్య శాఖ భారీ స్థాయిలో పదోన్నతులు కల్పించింది. వివిధ విభాగాల అధీనంలో పనిచేసే దాదాపు 600 మంది వైద్యులు ప్రమోషన్లు పొందారు. గత కాలంలో పదోన్నతుల విషయంలో ఆలస్యం జరిగినట్లు ఫిర్యాదులొచ్చిన నేపథ్యంలో నిర్ణీత సమయంలో అర్హులైన వైద్యులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించడంతో ఈ స్థాయిలో పదోన్నతులు జరిగాయని ఉన్నతాధికారులు తెలిపారు.

**ప్రిన్సిపాళ్లు/ సూపరింటెండెంట్లుగా పదోన్నతి**

వివిధ విభాగాలకు చెందిన ఆరుగురు సీనియర్ ప్రొఫెసర్లను ఎడిఎంఇలుగా(అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ) ప్రమోట్ చేయాలని తాజాగా వచ్చిన కమిటీ సిఫారసులను మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదించారు. వీరు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధానాసుపత్రుల సూపరింటెండెంట్లుగా నియమించబడతారు. వీరికి త్వరలో పోస్టింగ్‌లిస్తారు. దీంతో 2024-25 ప్యానల్ ఇయర్‌లో మొత్తం 13 మంది సీనియర్ వైద్యులు ఎడిఎంఇలుగా ప్రమోటయ్యారు.

**సెంకడరీ వైద్య సేవలందిస్తున్న 321 మందికి ప్రమోషన్లు**

ప్రభుత్వ సెంకడరీ ఆసుపత్రుల్లో వివిధ స్థాయిల్లో సేవలందిస్తున్న 321 మంది వైద్యులకు శని, ఆది వారాల్లో పదోన్నతులు కల్పించినట్లు సెంకడరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి తెలిపారు. వీరిలో...34 మంది సివిల్ సర్జన్ స్పెషలిస్టులుగాను, 78 మంది డెప్యుటీ సివిల్ సర్జన్ స్పెషలిస్టులుగాను, 109 మంది డిప్యుటీ సివిల్ సర్జన్ జనరల్‌గాను పదోన్నతి పొందారు. వీరితో పాటు 100 మంది డెంటల్ అసిస్టెంట్ సర్జన్లు డెప్యుటీ డెంటల్ సర్జన్లుగా ప్రమోటయ్యారు.

**డిఎంఇలో కూడా భారీగా పదోన్నతులు**

ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధానాసుపత్రుల్లో పనిచేసే 217 మంది వైద్యులకు 2024-25లో ప్రమోషన్లు కల్పించడం జరిగింది. వీరిలో 13 మంది వైద్యులు ఎడిఎంఇలుగాను, 96 మంది ప్రొఫెసర్లుగాను, మరో 108 మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగాను ప్రమోటయ్యారు.

**600 మందికి పదోన్నతులు**

2024-25 ప్యానల్ సంవత్సరంలో ప్రైమరీ, సెంకడరీ, టెరిషరీ మరియు ఆయుష్ వైద్య సేవలు అందిస్తున్న దాదాపు 600 మంది వైద్యులకు ఆయా విభాగాల్లో పదోన్నతులు కల్పించినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. నిర్ణీత సమయంలో వైద్యులకు పదోన్నతులు కల్పించడానికి కృషి చేసిన మంత్రిత్వ శాఖ మరియు వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులను మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు.

# మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా మూడు లక్షల పింఛన్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఉండడం అందరం చేసుకున్న అదృష్టమన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చా మన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని, అందులో భాగంగా మత్స్యకారులకు రూ .35 లక్షల విలువైన ఇంజన్లను పంపిణీ చేసి ఆదుకున్నామన్నారు. అలాగే బోట్లు, వలలు మంజూరు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు ఆయిల్ రాయితీని నిలిపివేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు ఆయిల్ రాయితీ బిల్లులను చెల్లింపు చేసినట్లు వివరించారు. భావనపాడులో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సబ్ స్టేషన్లు ఏర్పాటుకు అవకాశాలను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

ఖరీఫ్ సీజన్ లో రైతులకు సరిపడా యూరియాను పంపిణీ చేసామని, ఇంకా అవసరం మేరకు యూరియాను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. యూరియా బఫర్ నిల్వలను పంపిణీ చేయమని మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించామని అన్నారు. కేంద్రం నుండి గన్నవరం పోర్టుకు యూరియా స్టాక్ వచ్చిందని, త్వరలో జిల్లాకు అందుబాటులో ఉండనున్నట్లు చెప్పారు. ప్రైవేట్ డీలర్లు రైతులకు ప్రలోభాలు పెట్టి అధిక ధరలకు విక్రయించకుండా విజిలెన్స్ దాడులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, రైతుల ఆందోళన చెందకుండా ప్రభుత్వానికి సహకరించాలని



కోరారు. రాష్ట్రంలో మహిళలకు స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పది వేల బస్సులు సామర్థ్యం కాగా తొమ్మిది వేల బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు పునరుద్ఘటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాల పట్ల ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నట్లు మంత్రి వ్యక్తం చేశారు.

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థను గాడిన పెట్టి 16,700 ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందని వచ్చే నెల 15వ ఉద్యోగ నియామక పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. కోటి రూపాయల వ్యయంతో హిరమండలం రిజర్వాయర్ నీటిని సుంకర జగన్నాథపురం నుంచి గ్రామానికి రప్పించి ఇంటింటికి తాగు నీటిని అందించనున్నట్లు తెలిపారు. సముద్ర తీర ప్రాంతాలైన వాడపేట, మధ్య పేట, కొత్తపేటను కలుపుతూ పర్యాటకంగా అభివృద్ధికి రహదారుల నిర్మాణాలను చేపట్టనున్నామని మంత్రి తెలిపారు.

**గ్రామంలో రూ.2.31 కోట్ల అభివృద్ధి పనులు :** భావనపాడు గ్రామంలో రూ. 2.31 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. రూ. 1.21 కోట్లతో బీచ్ వరకు పర్యాటక రోడ్లను మంత్రి ప్రారంభించారు. రూ. 1.10 కోట్ల గ్రామ అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 40 లక్షలలో నిర్మించిన చేపలు ఎండబెట్టుకునే పది ప్లాట్ ఫారాలను ప్రారంభించారు. దశలవారీగా మురుగు కాలువల నిర్మాణాలు జరుపనున్నట్లు మంత్రి తెలిపారు.

**క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ :** గ్రామంలో క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సాంకేత పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు మేలు జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి అన్నారు. నెల రోజులు పాటు రేషన్ షాపును అందుబాటులో ఉంచుతామన్నారు. బియ్యం అవసరం లేనివారికి ప్రత్యామ్నాయంగా కావలసిన నిత్యవసర వస్తువులను తీసుకునే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరు కట్ల విశ్వప్రసాద్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, జిల్లా ట్రైనీ సహాయ కలెక్టర్ దొనక పృథ్వీ రాజ్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్డిఏ పిడి ఎన్ .కిరణ్ కుమార్, జిల్లా మత్స్య శాఖ ఉపసంచాలకులు సత్యనారాయణ, జిల్లా పర్యాటక శాఖ అధికారి పి.నారాయణ రావు , ఆర్డిఓ ఎం. కృష్ణమూర్తి, ఎలక్ట్రికల్ ఏడి సి హెచ్ కృష్ణమూర్తి, వ్యవసాయ అధికారి అ-ప్పారావు, ఆర్డబ్ల్యూఎస్ జే ఈ రామకృష్ణ, మెరైన్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ హేమ సుందర్రావు, టెక్కలి జనసేన పార్టీ సమన్వయకర్త కణితి కిరణ్ కుమార్, లింగుడూ కుమార్, తెదేపా నాయకులు బై తులసి దాస్, గోరకల ఆదినారాయణ, అడ్ల రాజేష్,దానేశ్ , పీ ఏ సీ ఎస్ చైర్మన్ కుచెట్టి కాంతారావు, మాజీ పీ ఏ సి ఎస్ అధ్యక్షుడు అట్టడా రామ్ ప్రసాద్, జీరు భీమారావు తదితరులు, పాల్గొన్నారు.

## విఘ్నేశ్వర సర్జికల్ వరల్డ్ ప్రారంభం



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** సర్జికల్ హెూల్ సేల్ వ్యాపార రంగంలో తాజాగా విగ్నేశ్వర సర్జికల్ వరల్డ్ పేరిట, హెూల్ సేల్ సర్జికల్ నూతనషాప్ ముస్తాబైన క్రమంలో, పట్టబధ్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని, విజ్ఞేశ్వర సర్జికల్ వరల్డ్ ను ప్రారంభించారు. స్థానిక గంగానమ్మపేటలోని హెూల్ సేల్ మెడికల్ షాపుల బజారులో, నూతనంగా ఏర్పాటు చసిన విఘ్నేశ్వర సర్జికల్ వరల్డ్ హెూల్ సేల్ సర్జికల్ షాపును ఆదివారం,కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత షాపు నిర్వాహకులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు, సాదర స్వాగతం పలికారు. ఈ క్రమంలో నిర్వహించిన ప్రత్యేక పూజలలో, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని,షాపు నిర్వాహకులు చిన్నా కు,అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ కుద్దూస్, పద్మశాలియ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనుల పరిశీలన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :**గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గళ్ళా మాధవి సోమవారం సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద, నెహ్రూనగర్ పంప్ హౌస్ వద్ద జరుగుతున్న ప్రధాన పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి, అధికారులతో మాట్లాడుతూ.... పనులు నిర్దేశిత సమయానికి పూర్తవ్వాలని, తాగునీటి సరఫరా యధావిధిగా కొనసాగించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల వేగవంతానికి షిఫ్ట్‌ల వారీగా అధికారులను కేటాయించి, కాంట్రాక్టర్‌తో సమన్వయం సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఇంటర్ కనెక్షన్ ప్రాంతంలో ఈఈలు, డిఈఈలు పర్యవేక్షణ చేస్తూ, ఫిర్యాదులు వచ్చినప్పుడు వెంటనే ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా అందించాలనేది కూడా ఆమె ఆదేశించారు.

## ఎపిటిడిసి యూనిట్లను ప్రైవేటీకరించవద్దని జేఏసీ డిమాండ్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని పర్యాటక అభివృద్ధి సంస్థ (ఎపిటిడిసి) యూనిట్లను ప్రైవేటీకరించరాదని, ఆ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలని జెఎసి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ , ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ మరియు వర్కర్స్ జేఏసీ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. సోమవారం జేఏసీ రాష్ట్ర నాయకులు మేనేజింగ్ డెరెక్టర్‌కు లేఖ పంపారు. ఎపిటిడిసి యూనిట్లలో గత ఇరువై ఏళ్లుగా రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, మ్యాన్‌పవర్, డెయిలీవేజ్ ఉద్యోగులు ఉమ్మడి రాష్ట్ర కాలం నుండి సేవలందిస్తున్నారని, తక్కువ వేతనాలతోనూ సంస్థ అభివృద్ధికై కృషి చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు యూనిట్లను ప్రైవేటీకరించాలనే యాజమాన్యం నిర్ణయం ఉద్యోగులలో ఆందోళన కలిగిస్తోందని అన్నారు. మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉన్న పర్యాటక యూనిట్లు ప్రైవేటీకరణకు వెళితే సామాన్యులకు నష్టం వాటిల్లుతుందని, ముఖ్యంగా దశాబ్దాలుగా పనిచేస్తున్న ఉద్యోగుల ఉపాధి ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రైవేటీకరణ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, ఉద్యోగుల భవిష్యత్తును రక్షించాలని జేఏసీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ విజ్ఞప్తి పత్రంపై జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఏ.వి. నాగేశ్వరరావు, కో-చైర్మన్ బి.కాంతారావు, డి.దయామణి సంతకాలు చేశారు.

## భారీ జన సందోహం మధ్య భారీ గణనాథుని నిమజ్జనం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ )** మండల కేంద్రంలోని కొత్తూరు గ్రామంలో వెలసిన 23 అడుగుల భారీ గణనాథుని విగ్రహాన్ని సోమవారం సాయంత్రం భారీ జన సందోహం మధ్య అంగరంగ వైభవంగా నిమజ్జనం గావించారు. అశేష జన వాహిని మధ్య కేరళ సింగారి వాయిద్యాలతో పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ కొత్తూరు గ్రామం నుంచి మండల కేంద్రంలోని ఐదు రోడ్ల కూడలి మీదుగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి శ్రీఈశ్వరీ దేవి మఠం గుడి మీదుగా పురవీధులలో ఊరేగింపు చేసి శ్రీ ఈశ్వరీమాత ఆశ్రమం సమీపంలోని చెరువులో నిమజ్జనం గావించారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున హాజరై డీజే వద్ద డ్యాన్సులు చేస్తూ హుషారుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానికులతో పాటు మండల కేంద్రంలోని ప్రజలు హాజరై విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా స్థానిక ఎస్సై శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షణ గావించారు. కార్యక్రమంలో విగ్రహ దాత తిప్పన బ్రహ్మయ్య విద్యా మాధురి పండిట్ వీర మోహన్ నాగార్జున బోలా శ్రీనివాసులు ఆకుల విజయ్ అలాగే తిప్పన ప్రసాద్ ఆకుల శివ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సంస్కరణల పితామహుడు చంద్రబాబు నాయుడు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :**ఆంధ్రప్రదేశ్ లో అనేక విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్ర దశ,దిశా మార్చిన ఘనత చంద్రబాబు నాయుడికే దక్కుతున్నదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ.... 30సంవత్సరాల క్రితం తొలి సారి సిఎం గా బాధ్యతలు స్వీకరించి, 4 సార్లు రాష్ట్రానికి పాలన అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక సంస్కరణలు, సంక్షేమ పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్ కు కొత్త దిశ చూపించారు. ప్రజల భాగస్వామ్యంతో జన్మభూమి కార్యక్రమం, క్లీన్ అండ్ గ్రీన్ తో శుభ్రత విప్లవం, డ్వాక్రా మహిళా సంఘాలు ఏర్పాటు చేసి మహిళా శక్తి పెంపొందింపు, విద్యుత్ రంగ సంస్కరణలు, ప్రైవేటు రంగంలో తొలి విమానాశ్రయం, పిపిపి మోడల్ లో నేషనల్ హైవేస్ నిర్మాణం, హైటెక్ సిటీతో ఐటీ విప్లవానికి నాంది, ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీలు, 1.80 లక్షల టీచర్ల నియామకం, స్థానిక టూరిజం అభివృద్ధి, డిజిటల్ గవర్నెన్స్, రియల్ టైం గవర్నెన్స్, అన్నా క్యాంటీన్లు, నదుల అనుసంధానం, సాగునీటి ప్రాజెక్టులు, రైతు యాంత్రీకరణ, ఎస్సీ వర్గీకరణ అమలు, అమరావతి నిర్మాణం వంటి 30 కీలక మైలురాళ్లు ఆయన పాలనలో చోటు చేసుకున్నాయి" అని ఎమ్మెల్యే తెలిపారు.

"చంద్రబాబు గారి విజన్ 2020 రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేయగా, ఇప్పుడు కూడా ఆయన కలలన్నీ సాకారం అయ్యేలా మేము కృషి చేస్తాము. ఆయన నాయకత్వం వల్లనే ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలిచింది. ప్రజల పాలనకు దగ్గరగా తీసుకువెళ్ళిన నాయకుడు చంద్రబాబు గారు. ఆయన చూపించిన మార్గంలో నడుస్తూ గుంటూరు పశ్చిమలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు చేస్తాను" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.

## కన్నెల వాగు చెరువుకు నీరు

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)** ఖాజిపేట మండలం నందలి కన్నెల వాగు చెరువును ఇవాళ ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులు మరియు రైతులతో మాట్లాడటం జరిగింది.

కన్నెల వాగు చెరువుకు నీటిని నింపేందుకు ఎమ్మెల్యే చేసిన కృషికి మండల నాయకులూ రైతులు అభినందించి ధన్యవాదములు తెలపటం జరిగింది. కన్నెల వాగు చెరువుకు నీటిని నింపటం ద్వారా మండలం నందలి చాలా గ్రామాల రైతులకు సాగు నీటి కొరత లేకుండా ఎంతో ఉపయోగపడుతుంది.

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ గత సంవత్సర కాల వ్యవధిలో రెండో సారి కన్నెల వాగు చెరువుకు





నీటిని నింపటం ద్వారా వారికి రైతుల మీద ఉన్న అమిత మైన ప్రేమకు నిదర్శనం అని మండల ప్రజలు కొనియాడినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతన్నల కళ్లల్లో ఆనందం చూడటమే తన ధ్యేయమని వారి శ్రేయస్సే తన లక్ష్యమని తెలియజేసినారు.

## కేసీఆర్‌కు అవినీతి మరక వెనుక హరీశ్‌రావు పాత్రలేదా?:

**హైదరాబాద్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పక్కనున్న కొందరు చేసిన పని వల్లే ఆయనకు చెడ్డపేరు వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. అందులో ఐదేళ్లపాటు ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు పాత్ర లేదా? అని ప్రశ్నించారు. మాజీ ఎంపీ సంతోష్, హరీశ్‌రావు వల్లే కేసీఆర్‌కు చెడ్డపేరు వచ్చిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. కాళేశ్వరంలో చిన్నభాగం కుంగితే మొత్తం ప్రాజెక్టు పోయినట్లు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.

" కేసీఆర్ జనం కోసం పని చేస్తే.. వాళ్లు ఆస్తుల పెంపుకోసం పని చేశారు. హరీశ్‌రావు, సంతోష్ నాపై ఎన్నో సార్లు కుట్రలు చేశారు. అయినా నేను నోరు మెదపలేదు. ఈ రోజు కేసీఆర్ బిడ్డగా నేను ఎంతో బాధపడుతున్నా. హరీశ్‌రావు , సంతోష్ వెనుక రేవంత్‌రెడ్డి ఉన్నారు. వారి మధ్య లోపాయకారి ఒప్పందం కుదిరింది. హరీశ్‌రావు, సంతోష్‌ను రేవంత్ రెడ్డి ఏమీ



అనరు. నా తండ్రిపైనే బాణం వేస్తారు. కేసీఆర్ మీద సీబీఐ దర్యాప్తు వేశాక పార్టీ ఉంటే ఏంటి? లేకపోతే ఏంటి? ఇది నా తండ్రి పరువునకు సంబంధించింది. నా లేఖ బయటకు వచ్చినా నేను ఎవరి పేర్లు బయటపెట్టలేదు. రేవంత్‌రెడ్డి ప్రీ-ప్లాన్‌డ్‌గా సీబీఐ పేరు చెప్పారు. కేసీఆర్ హిమాలయ పర్వతం లాంటి వారు. ఆయనకు అవినీతి మరక అంటితే బాధగా ఉంది. నాకు పెళ్లి చేసేందుకు కూడా మా నాన్న ఆర్థిక ఇబ్బంది పడ్డారు. దేవుడి లాంటి నా తండ్రిపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశిస్తే నాకు బాధగా ఉండదా? కేసీఆర్‌ని నిన్న అన్ని మాటలు అంటుంటే, ఒక్కరు కూడా నోరు విప్పకపోవడం ఏంటి? రేవంత్.. మీకు దమ్ముంటే.. లోపాయకారీ ఒప్పందం లేకపోతే నేను పేర్లు కూడా చెప్పా.. చర్యలు తీసుకోండి. బీసీల రిజర్వేషన్లపైనా బిల్ పెడతారు. కానీ, ఎందుకు సుప్రీం కోర్టు దాకా వెళ్లి పోరాడటం లేదు. బిహార్ కోసం తెలంగాణ బీసీ బిడ్డలను రేవంత్ బలి చేస్తున్నారు. తెలంగాణ జాగృతి నుంచి బిహార్ వెళ్లి మీ బండారం బయటపెడతాం. సీబీఐ కాదు, ఇంకే ఎంక్వైరీ వేసిన కేసీఆర్ కడిగిన ముత్యంలా వస్తారు" అని ధీమా వ్యక్తం చేశారు.

## ముంబయి వీధులను రేపటిలోగా ఖాళీ చేయండి: బాంబే హైకోర్టు

**ముంబయి:** మరాఠాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సామాజిక కార్యకర్త మనోజ్ జరాంగే చేస్తున్న ఉద్యమం తీవ్రరూపం దాలుస్తోంది. మరోవైపు మరాఠా కోటా నిరసనలపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నిరసనలు ముంబయిలో తీవ్ర ట్రాఫిక్ జామ్‌కు కారణం కావడంతో హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. రేపటి(సెప్టెంబర్ 2)లోగా నిరసనకారులు ముంబయి వీధులను వీడాలని ఆదేశాలిచ్చింది. సోమవారం ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో మరాఠా రిజర్వేషన్ల ఆందోళన చేపట్టారు. వేలాది మంది నిరసనకారులు దక్షిణ ముంబయికి చేరుకోవడంతో.. సీఎస్‌టీ, ఫోర్ట్, చర్చిగేట్ తదితర మార్గాల్లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. నిరసనకారులు పలు మార్గాలను బ్లాక్ చేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

దీంతో ఈ నిరసనలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నిరసనలు శాంతియుతంగా జరగడం లేదని.. నిబంధనలన్నీ ఉల్లంఘిస్తున్నారని కోర్టు వ్యాఖ్యానించింది. ఉద్యమకారుడు మనోజ్ జరాంగే పాటిల్, అతడి మద్దతుదారులు ముంబయి వీధులను మంగళవారం మధ్యాహ్నంలోగా ఖాళీ చేయాలని ఆదేశించింది. మరాఠా వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలన్న తన డిమాండ్ నెరవేరే వరకూ ముంబయి విడిచి వెళ్లబోనని కోటా ఉద్యమకారుడు మనోజ్ జరాంగే పాటిల్ ఆదివారం తెగేసిచెప్పిన విషయం తెలిసిందే.

## స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ




**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):**ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన స్మార్ట్ రైస్ కార్డులను మండల పరిధిలోని గ్రామాలలో రేషన్ దుకాణాల వద్ద పంపిణీ చేసినారు. మండల కేంద్రం అయిన కాకుమాను గ్రామంలో జరిగిన కార్యక్రమం లో ముఖ్య అతిధులుగా తహసిల్దార్ బి.వెంకట స్వామి ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ మండలంలో 13617 నూతన స్మార్ట్ రైస్ కార్డులు వచ్చాయని తెలిపారు. వీటన్నింటినీ రేషన్ దుకాణాల వద్ద డీలర్లు కార్డుదారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వీటి పర్యవేక్షణ నిమిత్తం సిబ్బంది ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి కూటమి నాయకులు మామిళ్లపల్లి. రాం గోపాల్, యడ్లపాటి. శ్రీధర్ శర్మ,నల్లమోతు. పూర్ణ చంద్ర రావు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 14న న్యాయవాదుల ధర్మసమ్మేళం



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** హిందూ దేవాలయాల ఆస్తుల పరిరక్షణ దేవీ దేవతల విగ్రహాల పరిరక్షణ, హిందూ ధర్మానికి ఎటువంటి హాని జరిగినా చట్ట ప్రకారం న్యాయ సాధన కోసం,ది ఫారం ఆఫ్ హిందూలాయర్స్ సంస్థను ప్రారంభించనున్నట్లు శైవ క్షేత్ర పీఠాధిపతులు శ్రీ శివ స్వామీజీ పేర్కొన్నారు. సోమవారం తెనాలిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శివ స్వామీజీ మాట్లాడుతూ రాష్ట్రంలోని హిందూ న్యాయవాదులను ఒక వేదిక మీదకు తీసుకొచ్చే ప్రయత్నంగా ఈనెల 14వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా, స్వామీజీలతో హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనం కార్యక్రమం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనికి 26 జిల్లాలలో గల 150 బార్ అసోసియేషన్ల నుండి 1500 మంది న్యాయవాదులకు ఆహ్వానం పలికినట్లు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో స్థానిక హిందూ న్యాయవాదులతో కలిసి ప్రచార కరపత్రాన్ని స్వామీజీ ఆవిష్కరించారు.

## పాఠశాల కు కంప్యూటర్ లు బహూకరణ



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):**దాతలు అందిస్తున్న సాయం అభినందనీయం అని కాకుమాను మండల విద్యా శాఖ అధికారి కెన్నెడీ తెలిపారు. కాకుమాను మండల పరిధిలోని కొమ్ము రు గ్రామం లో గల జిల్లా పరిషత్ హై స్కూల్ నకు సోమవారం పొన్నూరు పట్టణానికి చెందిన రిటైర్డు లెక్చరర్ ఆనందరావు వారి సోదరులు వారి తండ్రి వర్ధంతి సందర్భంగా ఒక కంప్యూటర్ ను అందజేశారు. అదే విధంగా హైదరాబాద్ కు చెందిన ట్రైకాడ్ డిజైన్స్ కంపెనీ అధినేత ఎం.శేషగిరిరావు,మాధవి లు కంప్యూటర్ ను పాఠశాల కు అందించినారు. ఈ సందర్భంగా పాఠశాల నందు ఏర్పాటు చేసిన కార్యక్రమం లో దాతలను పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు దాతలు చేస్తున్న కృషి కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులు దాతలు అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదువుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో లక్ష్మీ నారాయణ,శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు ఆరోపణలపై రామచంద్రయాదవ్ ఫైర్

**– నాపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఒక్కొక్కరి జాతకాలు బయట పెడ్తా**

**– దమ్ముంటే ప్రజా సమస్యలపై పోరాటం చేయండి**

**– శ్రీక్రిష్ణుడి గురించి తప్పుగా మాట్లాడితే తీవ్ర పరిణామాలు**

**– నాపై చేస్తున్న ఆరోపణలు నిరూపిస్తే... రాజకీయాలు వదిలేస్తా**

**– గాల్లో విమర్శలు చేస్తే చూస్తూ ఉండటానికి నేను జగన్ మోహన్ రెడ్డిని కాదు**

**– బిసిల ముసుగులో విమర్శలు చేస్తున్న కొందరు టిడిపి పేటిఎం ఏజెంట్లకు రామచంద్రయాదవ్ వార్నింగ్**

రామచంద్రయాదవ్ పై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై ఆయన స్పందించారు. సోషల్ మీడియాలో విమర్శలు చేసి వారిపై ఫైర్ అయ్యారు. బిసిల ముసుగులో ఉంటూ టిడిపికి పనిచేస్తున్న కొందరు పేటిఎం ఏజెంట్లకు వార్నింగ్ ఇచ్చారు. తనపై చేస్తున్న విమర్శల్లో ఏ ఒక్కటి నిజమని నిరూపించినా రాజకీయాలు వదిలేస్తానని సవాల్ విసిరారు. వ్యక్తిగత విమర్శలు మానుకోకపోతే ఒక్కొక్కరి జాతకాలు బయటపెడుతానని అల్టిమేటం ఇచ్చారు. తక్కెళ్లపాడు ఘటనలో శ్రీక్రిష్ణుడి విగ్రహానికి అపచారం జరుగుతుందని అక్కడికి వెళ్లి నిర్వాహకులతో మాట్లాడి వచ్చాక వారు జరిగిన తప్పును తెలుసుకొని విగ్రహాన్ని మార్చారన్నారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆ రోజే క్రుతజ్ఞతలు తెలిపానన్నారు. కానీ కొందరు ఉన్మాదులు ఆరోజు నుంచి సోషల్ మీడియాలో తనపై, బిసివై పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వ్యక్తిగతంగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసిల ముసుగులో ఉన్న కొందరు టిడిపి పేటిఎం ఏజెంట్లు, టిడిపి కోసం పనిచేసే కొందరు మీడియా ప్రతినిధులు, య్యూటూబర్లు నిద్రాహారాలు మాని తనపై విమర్శలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. తాను పుంగనూరులో పోటీ చేస్తే 4500 ఓట్లు వచ్చాయని ఎద్దేవా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు ఎవరు వెన్నుపోటు కారణమో అందరికీ తెలుసునన్నారు. వెన్నుపోటుకు పేటెంట్ ఉన్న నాయకుడు నమ్మించి మోసం చేశాడని ఎద్దేవా చేశారు. పుంగనూరులో తాను కేవలం నామినేషన్ మాత్రమే వేశానని ఎన్నికలు చేయలేదన్నారు. దానికి కారణం కూడా ఎవరో అందరికీ తెలుసునన్నారు. 4500 ఓట్లు వచ్చిన రామచంద్రయాదవ్ ను చూసి ఉలిక్కిపడుతున్న ఈ పేటిఎం ఏజెంట్లు... ఒక వేళ పుంగనూరులో గెలిచి ఉంటే వారి పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదని ఛలోక్తులు విసిరారు.

**విమర్శలు మానుకోకపోతే ఒక్కొక్కరి జాతకాలు బయటపెడతా**

తనపై నిరాధార ఆరోపణలు చేస్తే ఒక్కొక్కరి జాతకాలు బయటపెడుతానని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను పేటిఎం ఏజెంట్లు లాగ గాల్లో మాట్లాడను అని, సాక్ష్యాలతోనే మాట్లాడుతానని సవాల్ విసిరారు. ఎన్టీ రామారావుకి పెట్టే విగ్రహాలకు తాము వ్యతిరేకం కాదన్నారు. కానీ భగవంతుడికి అపచారం జరిగితే మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమన్నారు. ఎన్టీఆర్ ను రాజకీయంగా వాడుకొని, పూజలు చేసే నాయకులు... అవసరం లేనప్పుడు చెప్పులతో కొట్టిన చరిత్ర కూడా గుర్తు పెట్టుకోవాలన్నారు. తాను సిద్ధాంత పరంగా మాత్రమే విమర్శలు చేస్తానని వ్యక్తిగత విమర్శలు ఎప్పుడూ చేయలేదన్నారు. తనపై విమర్శలు చేసే ఆ ఉన్మాదులు ప్రజా సమస్యలపై ఫోకస్ పెడితే ప్రజలకు మంచి జరుగుతుందని హితవు పలికారు.

**రెండో బాబాయ్ గురించి మాట్లాడితే తల కూడా ఎత్తుకోలేరు**

రాష్ట్రంలో అందరికీ ఒక్క బాబాయ్ గురించి మాత్రమే తెలుసునని, తాను ఇంకో బాబాయ్ గురించి మాట్లాడితే తలలు ఎక్కడ పెట్టుకుంటారని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే హెరిటేజ్ పై కూడా సాక్ష్యాలతో మాట్లాడాల్సి వస్తుందన్నారు. తనకు ఒక్కొక్కరి చరిత్రా తెలుసునని, అనవసరంగా వ్యక్తిగత విమర్శలు చేసి తమ జాతకాలు బయటపడేలా చేసుకోవద్దని హెచ్చరించారు. తాను ఏదీ గాల్లో మాట్లాడనన్నారు. తాను మాట్లాడే ప్రతి మాటను ఆధారాలతోనే మాట్లాడుతానన్నారు.

**గాల్లో విమర్శలు చేస్తే చూస్తూ ఉండటానికి నేను జగన్ మోహన్ రెడ్డిని కాదు**

కొందరు ఉన్మాదులు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తుంటే చూస్తూ ఉండటానికి తాను జగన్ మోహన్ రెడ్డిని కాదని రామచంద్రయాదవ్ ఫైర్ అయ్యారు. తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తే పరిస్థితి వేరేలా ఉంటుందన్నారు. నిజంగా దమ్ముంటే జగన్ మోహన్ రెడ్డి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని సవాల్ విసిరారు. దోచుకున్న అవినీతి సొమ్మును కక్కించాలన్నారు. అవన్నీ వదిలేసి రామచంద్ర యాదవ్ పేరు చెబితేనే ఉలిక్కి పడుతున్నారని ఎద్దేవా చేశారు.

**ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా**

తనపై చేస్తున్న ఆరోపణల్లో ఒక్కటైనా నిజమని నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తానని రామచంద్రయాదవ్ సవాల్ విసిరారు. తాను ఎవరికో బినామీ అని, తన వెనుక ఏదో పార్టీ ఉందని, ఎవరో నాయకుడు తనను నడిపిస్తున్నాడని చిల్లర విమర్శలు చేసే వారికి ఘాటుగా బుద్ధి చెబుతానన్నారు. పసలేని, నిరాధార ఆరోపణలు చేసి విలువలు పోగొట్టుకోవద్దని హెచ్చరించారు. జాతికి జరుగుతున్న అవమానాలను చూస్తూ కూడా చిల్లర కాసులకు కక్కుర్తి పడి పార్టీల మోచేతి నీళ్లు తాగుతున్న కొందరు బిసి సంఘాల నాయకులు ఇకనైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు.

**శ్రీక్రిష్ణుడిపై వక్రభాష్యం చెబితే తాట తీస్తాం**

శ్రీక్రిష్ణుడిపై కొంత మంది పేటిఎం ఉన్మాదులు అభ్యంతరకర వ్యాఖ్యలు, పోస్టులు పెడుతున్నారని అలాంటి వారిని ఉపేక్షించేంది లేదని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్వాపరయుగం గురించి, శ్రీక్రిష్ణుడి రూపం గురించి మాట్లాడితే తాట తీస్తామన్నారు. కొందరు ఎన్టీరామారావు వల్లే శ్రీక్రిష్ణుడి ప్రతిష్ట పెరిగిందని చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ ధర్మం గురించి, దేవుళ్ల గురించి పిచ్చి కూతలు కూస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

**బీహార్ లో పోటీపై క్లారిటీ**

బీహార్ రాజధాని పాట్నాలో ఇటీవల తాను పర్యటించానని, కానీ దాన్ని కూడా రాజకీయం చేసి కొందరు చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక మాజీ ఐఎఎస్ అధికారి ఆహ్వానం మేరకు తాను పాట్నాకు వెళ్లానన్నారు. అక్కడ ఉన్న కొందరు అభిమానులతో ఆత్మీయ సమావేశం నిర్వహించామన్నారు. అయితే తాను అక్కడ పోటీ చేయబోతున్నానని ప్రచారం చేస్తున్నారన్నారు. తాను ఆ రోజే మాట్లాడనని, బీహార్ అభివృద్ధిలో ఒక రాజకీయ పార్టీగా బిసివై పార్టీ అండగా ఉంటుందని ప్రకటించానన్నారు. ఎన్నికల తరువాత బీహార్ లో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై ఒక రాజకీయ పార్టీగా స్పందిస్తానని అక్కడి వారికి మాట ఇచ్చానన్నారు. కానీ కొందరు తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అక్కడ ఉన్న యాదవ నాయకులకు వ్యతిరేకంగా నేను పోటీ చేస్తున్నానే అర్థం వచ్చేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తాను బడుగులకు రాజ్యాధికారం రావాలనే రాజకీయాల్లోకి వచ్చానని, బడుగులు, బహుజనులను ఏకం చేస్తానే తప్ప చీలిక తీసుకువచ్చే శక్తులను కూడా ఉపేక్షించనని రామచంద్రయాదవ్ క్లారిటీ ఇచ్చారు.

## అవనిగడ్డ లో అగ్నిప్రమాదం



**అవనిగడ్డ, సెప్టెంబరు 1 (జర్నలిస్ట్ ఫైల్) :** అవనిగడ్డ లో ఆదివారం సాయంత్రం భారీ ప్రమాదం జరిగింది. రెండో వార్డులో ముగ్గురు రైతులకు చెందిన 30 ఎకరాల వరిగడ్డి వామి దహనమైంది. నివాస గృహాల మధ్య ఉన్న గడ్డివామి ఒక్కసారిగా తగలబడటంతో స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన తరలివచ్చి మంటలను ఆర్పి ప్రమాద తీవ్రతను అదుపు చేశారు. హొఘటనపై రైతు రంగారావు మాట్లాడుతూ ఎవరో కావాలని తమ వరిగడ్డి తగులబెట్టారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై విచారణ చేస్తామని అధికారులు ప్రకటించారు. బాధితులను నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు బండే రాఘవ పరామర్శించారు.

## చంద్ర గ్రహణం రోజున పెద్దింట్లమ్మ దేవాలయం మూసివేత

**కొల్లేటికోట, సెప్టెంబరు 1 (జర్నలిస్ట్ ఫైల్) :** ఏలూరు జిల్లా, కైకలూరు మండలం, కొల్లేటికోట గ్రామంలో వేంచేసియున్న శ్రీ పెద్దింటి అమ్మవారి దేవాలయము సెప్టెంబర్ 07 న 3.00 గం. ల నుండి చంద్రగ్రహణం కారణంగా మూసి వేయ బడును. మరలా సెప్టెంబర్ 08 అనగా సోమవారం ఉదయం 9.00 గం. ల నుండి భక్తులకు దర్శనము నిమిత్తము ఆలయము తెరువబడును. కావున భక్తులు గమనించి సహకరించగలరు అని ఆలయ కార్య నిర్వహణాధికారి కె. శ్రీనువాసు ఒక ప్రకటనలో తెలియజేశారు.



## పదవీ విరమణ పొందిన వారిని ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికిన జిల్లా ఎస్పీ..!!

**-జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ ఐ.పి.ఎస్**

**కడప, సెప్టెంబరు 1 (జర్నలిస్ట్ ఫైల్) :** దాదాపు 40 ఏళ్ళ క్రితం ఉన్నప్పటి పరిస్థితులను ధీటుగా ఎదుర్కొంటూ,క్రమ శిక్షణ,అంకితభావంతో నాలుగు దశాబ్దాలపాటు నిర్విరామంగా పోలీస్ శాఖలో సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ ఐ.పి.ఎస్ పేర్కొన్నారు. ఈనెల. ఆగస్టు నెలాఖరున పదవీ విరమణ పొందిన సిబ్బందిని ఆదివారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందచేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్.పి మాట్లాడుతూ రాష్ట్ర పోలీస్ శాఖ దేశంలో ప్రత్యేక స్థానంలో ఉండడానికి మీలాంటి సిబ్బంది సేవలు కీలకమన్నారు. ఎలాంటి సెల్ ఫోన్లు, కమ్యూనికేషన్ లేని రోజుల్లో కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహించడం మామూలు విషయం కాదని, ఎన్ని ఇబ్బందులున్నా, సమస్యలున్నా బాధ్యత అనేది పోలీస్ శాఖలో సమస్యలను అధిగమించేలా చేస్తుందన్నారు. పోలీస్ శాఖలో సమాజానికి అత్యంత సన్నిహితంగా మెలిగే వ్యక్తి కానిస్టేబుల్ అని, కానిస్టేబుల్ పోలీస్ శాఖకు వెన్నెముక లాంటి వారని అభివర్ణించారు. వ్యక్తిగత జీవితాన్ని, వృత్తిగత జీవితాన్ని సంతులనం చేసుకుంటూ పిల్లలను ఉన్నతస్థాయిలో తీర్చిదిద్దడం సంతోషంగా ఉందన్నారు. పదవీ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్.పి సూచించారు. పదవీ విరమణ సందర్భంగా పదవీ విరమణ పొందుతున్న వారి జీవిత ఘట్టంలోని విశేషాలు, విధి నిర్వహణలో సాధించిన ఘనతలు, పొందిన అభినందనలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా



ప్రదర్శించిన ఆడియో విజువల్ ప్రదర్శన ఆహుతులను విశేషంగా అలరించింది. హొ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ లను జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ ఐ.పి.ఎస్ ప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్.పి బి.రమణయ్య ఏ.ఆర్ డి.ఎస్.పి కె.శ్రీనివాసరావు , ఆర్.ఐ లు వీరేష్, టైటస్, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఈ.సి మెంబర్ ఏప్రిన్, పదవీ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు పదవీ విరమణ సన్మానం పొందిన వారు ఎ.శివనాగేంద్ర కుమార్ , ఎస్.ఐ, డి.సి.ఆర్.బి, కడప. ఎ.వి రమణయ్య, ఎ.ఎస్.ఐ, కమలాపురం పి.ఎస్ బి.శ్రీనివాసులు, ఎ.ఆర్.హెచ్.సి 1065, డి.ఎ.ఆర్, కడప. పదవి విరమణ పొందిన వారిని సన్మానించినట్లు తెలియజేశారు.

## పెన్నా నదిలో ఈతకు వెళ్లి గల్లంతయిన యువకుని మృతదేహం లభ్యం..!!



**మైలవరం, సెప్టెంబరు 1 (జర్నలిస్ట్ ఫైల్) :** వైయస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన యువకుడు పెన్నా నదిలోకి ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం అయినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం వేపరాల గ్రామానికి చెందిన యువకుడు చిమ్మని వెంకటరమణ 32 సం. గుర్తింపు గల్లంతైన యువకుని కోసం పోలీస్ శాఖ, ఫైర్ శాఖ, సిబ్బంది. ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అతి కష్టం పైన యువకుడి ముందేహాన్ని గుర్తించి బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మైలవరం ఎస్సై శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు..

## వనిపెంట వైసీపీ నేత ఆర్కే సాయి ,పార్థివ దేహానికి ఘన నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే..!!

**మైదుకూరు, సెప్టెంబరు 1 (జర్నలిస్ట్ ఫైల్) :** వైయస్సార్ కడప జిల్లా మైదుకూరు, మండలం వనిపెంట గ్రామంలో శశిధర్ హౌసింగ్ బోర్డ్ మాజీ చైర్మన్ కుమారుడు అనారోగ్య కారణాలతో ఆర్కే,సాయి మరణించిన విషయం తెలిసిన తక్షణమే మైదుకూరు నియోజవర్గ మాజీ ఎమ్మెల్యే రఘురాం రెడ్డి పార్థివ దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వడం జరిగిందని.సాయి అందరితో కలిసిపోతూ పార్టీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనేవారు అని తెలియజేశారు. ఈకార్యక్రమంలో వనిపెంట సర్పంచ్ ఆదం గౌస్ లాజం,ఎంపీపీ ఇషా ద్, వైస్సార్సీపీ నాయకులు సుధాకర్ రెడ్డి,శేషు, వైఎస్ఆర్సిపి మండల ఉపాధ్యక్షుడు ఆదం కలాం,రఫీ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు



## రాయచోటిని జిల్లా కేంద్రంగానే కొనసాగిస్తాం.. అన్న మాట నిలబెట్టుకోవాలి..!!

**రాయచోటి, సెప్టెంబరు 1 (జర్నలిస్ట్ ఫైల్) :** రాయచోటి ని జిల్లా కేంద్రంగానే కొనసాగిస్తామని గత ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని అఖిల పక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు.అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి, రాజంపేట కేంద్రాలను ప్రత్యేక జిల్లాలుగా ఏర్పాటు చేస్తామని అదేవిధంగా రాయచోటి జిల్లా కేంద్రాన్ని కొనసాగిస్తామని గత సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల ప్రచార బహిరంగ సభల్లో చంద్రబాబు నాయుడు హామీలు ఇచ్చారని మళ్లీ జిల్లా పునర్విభజన కోసమని మంత్రివర్గ కమిటీని వేచారని దీనితో అన్నమయ్య జిల్లాలోని మూడు ప్రాంతాల ప్రజల్లో గందరగోళం నెలకొని ఉన్నదని, అన్నమయ్య జిల్లాలో నెలకొని ఉన్న ఈ పరిస్థితిపై ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రకటన చేయవలసిన అవసరం ఉందని ఆదివారం రాయచోటి రెవెన్యూ కార్యాలయం ప్రాంగణంలోని అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద జరిగిన అఖిలపక్ష కమిటీ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. రాయచోటి జిల్లా కేంద్రంగా కొనసాగే అర్హతలు అన్నీ ఉన్నాయని జిల్లా కేంద్రానికి కావలసిన భూములు గాని నేటి సౌకర్యం




గాని రాయచోటికి పుష్కలంగా ఉన్నాయని రాయలసీమలో అత్యంత వెనుకబాటతనం ఉన్న మండలాలైన గాలివీడు, %చీూ% కుంట, పెద్దమండెం, చిన్నమండెం గుర్రంకొండ, కలకడ,కె.వి వల్లి సంబేపల్లి, సుండువల్లి,వీరవల్లి రామాపురం,లక్కిరెడ్డిపల్లి చక్రాయపేట మండలాలకు రాయచోటి కేంద్రంగా ఉన్నదని సదరు వెనుకబడినమండలాల అభివృద్ధి చేయడానికి రాయచోటి కేంద్రంగా జిల్లా కొనసాగాల్సిన అవసరం ఉందని అఖిలపక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు.

# భారత్‌పై ఆంక్షలు విధించండి..

## ఐరోపా యూనియన్‌ను కోరిన అమెరికా



**బ్రస్సెల్స్, సెప్టెంబరు 1 :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని బూచిగా చూపి భారత్‌పై భారీగా సుంకాల భారాన్ని మోపిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమలాగే భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని యూరప్ దేశాలను కోరినట్లు సమాచారం. ప్రస్తుతం భారత దిగుమతులపై అమెరికాలో 50 శాతం టారిఫ్‌లు అమలులో ఉన్నాయి. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మాస్కో నుంచి చమురు కొనుగోలు చేయడం ఆపకపోతే అమెరికా మాదిరిగానే భారత్‌పై సుంకాలను పెంచాలని ట్రంప్ యంత్రాంగం యూరప్ దేశాలను కోరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆంక్షలు విధించడంతోపాటు భారత్ నుంచి చమురు, గ్యాస్ కొనుగోలును నిలిపి వేయాలని కోరినట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే విషయంపై చర్చించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇటీవల ట్రంప్ భేటీ అయ్యారు. యుద్ధం ముగించేందుకు అగ్రరాజ్యాధిపతి తీసుకుంటున్న చర్యలకు కొంతమంది యూరోపియన్ నాయకులు మద్దతు పలికినట్లు సమాచారం. అయితే భారత్‌కు వ్యతిరేకంగా ట్రంప్ తీసుకున్న కఠిన నిర్ణయాలపై యూరోపియన్ దేశాలు మౌనంగా ఉన్నాయి. సుంకాలు విధించడాన్ని సమర్థించలేదు. అలా అని తప్పుబట్టలేదు. ఈ క్రమంలో భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని ట్రంప్ పరిపాలనాధికారులు కోరడం గమనించాల్సిన విషయం. భారత్ నుంచి చమురు, సహజ వాయువు కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేయాలని, అమెరికా తరహాలో ఆంక్షలు విధించాలని శ్వేత సౌధం కోరినట్టు ప్రచారం జోరుగా సాగుతోంది. రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయని పక్షంలో రెండో దశ సుంకాలను విధించాలని కూడా సూచించినట్టు సమాచారం. తమపై 50 శాతం సుంకం విధించడాన్ని భారత్ తొలి నుంచీ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. రష్యా చమురును అత్యధికంగా కొనుగోలు చేస్తున్న చైనాను వదిలి తమపై సుంకాలు విధించడం ఏంటని భారత్ ప్రశ్నిస్తోంది. ఐరోపా దేశాలు కూడా రష్యా సహజవాయువును కొనుగోలు చేస్తున్న తీరును భారత్ లేవనెత్తింది. ఇక రష్యా ఉక్రెయిన్ యుద్ధం ముగించాలన్న ట్రంప్ ప్రయత్నాలకు కొందరు ఐరోపా నేతలు బహిరంగంగా మద్దతు పలుకుతూ తెర వెనుక మాత్రం పూర్తిగా విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని శ్వేత సౌధం భావిస్తోంది. రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై అమెరికా మండిపడుతున్నా ఐరోపా దేశాలు మాత్రం మౌనం వహించాయి. ట్రంప్ సుంకాల విధింపునకు బహిరంగంగా ఎలాంటి మద్దతు ప్రకటించలేదు. 'ఐరోపా నేతల విషయంలో శ్వేత సౌధం సహనం నశిస్తోంది' అని ఓవల్ ఆఫీసు ఉన్నతాధికారి ఒకరు కామెంట్ చేశారు. మరింత మెరుగైన డీల్ కోసం వేచి చూడాలని ఉక్రెయిన్ అధ్యక్షుడిని తెర వెనక ఉండి ఐరోపా దేశాలు ప్రోత్సహిస్తున్నట్టు వైట్ హౌస్ వర్గాలు భావిస్తు న్నాయి. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో పాల్గొనేందుకు చైనాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో చైనా, రష్యా అధ్యక్షు లతో ప్రత్యేకంగా చర్చలు జరిపే అవకాశం ఉన్న ట్టు తెలుస్తోంది. ఈ చర్చల్లో ట్రంప్ సుంకాలు, రష్యా ఉక్రెయిన్ యుద్ధం ప్రధాన అంశాలుగా ఉండనున్నాయని సమాచారం.



## భారత్ క్వాడ్‌సదస్సుకు ట్రంప్ డుమ్మా..

### తాజా పరిణామాల నేపథ్యంలో మనసు మార్చుకొన్న అమెరికా అధ్యక్షుడు

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 1 :** అమెరికా, భారత్ మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్న నేపథ్యంలో న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన కథనాలు మరింత సంచలనంగా కలిగించాయి. భారత్‌లో పర్యటించాలన్న ప్లాన్‌ను ట్రంప్ తాజాగా పక్కన పెట్టేసినట్టు న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. సెప్టెంబర్-డిసెంబర్ మధ్య కాలంలో క్వాడ్ సమావేశాల కోసం భారత్‌లో పర్యటిస్తానని ట్రంప్ గతంలో ప్రధాని మోదీకి చెప్పారట. ఆ తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఈ ప్లాన్స్‌ను పక్కన పెట్టేశారట. అయితే, ఈ విషయమై అటు అమెరికా, ఇటు భారత్ స్పందించలేదు. త్వరలో భారత్ వేదికగా క్వాడ్ కూటమి శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఇక ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే అమెరికాలో క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ప్రతిష్టంభన నెలకొందని న్యూయార్క్ టైమ్స్ రాసుకొచ్చింది. డొనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీల సంబంధాలు కూడా తిరోగమనంలో ఉన్నాయని పేర్కొంది. భారత్, పాక్ మధ్య రాజీ కుదిర్చానన్న ట్రంప్ ప్రకటనతో వివాదం ముదిరిందని న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. 'తనే రాజీ కుదిర్చానని ట్రంప్ పదే పదే చెప్పడం ప్రధాని నరేంద్ర మోదీకి కోపం తెప్పించింది. ట్రంప్ తీరుతో మోదీ సహనం నశిస్తోంది' అని తెలిపింది. ఇక కెనడాలో ఇటీవల జరిగిన జీ7 సమావేశాలకు అటు ట్రంప్ ఇటు ప్రధాని మోదీ ఇద్దరూ హాజరయ్యారు. ఆ సందర్భంగా ఇద్దరి మధ్య సమావేశం కూడా జరగాల్సి ఉంది. అయితే, ట్రంప్ అత్యవసరంగా అమెరికాకు వెనుదిరగాల్సి వచ్చింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీతో దాదాపు 35 నిమిషాలపాటు ఫోన్ కాల్‌లో మాట్లాడారట. ఈ సందర్భంగా భారత్‌పాక్ మధ్య మూడోదేశం మధ్యవర్తిత్వం అంగీకరించబోమని ప్రధాని మోదీ స్పష్టం చేసినట్టు తెలిసింది. నోబెల్ ప్రైజ్‌కు పాక్ తనను నామినేట్ చేస్తున్న విషయాన్ని కూడా ట్రంప్ ఆకాల్‌లో పేర్కొన్నారని, భారత్ కూడా ఇదే చేయాలన్న పరోక్ష సూచనచేశారని న్యూయార్క్ టైమ్స్ రాసుకొచ్చింది. ఈ కారణంగా ఇరు నేతల మధ్య ఎడం పెరిగినట్టుతెలిపింది. ఈ ఫోన్ కాల్‌కు సంబంధించి అమెరికా ఇంతవరకూ స్పందించలేదు.

# మహాకూటమి సిఎం అభ్యర్థిని నేనే..

## రాహుల్, అఖిలేష్ సమక్షంలోనే ప్రకటించిన తేజస్వి



**పాట్నా, సెప్టెంబరు1:** బీహార్‌లో మహా ఘట్‌బంధన్ కూటమి సీఎం అభ్యర్థి తానే అని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించారు. ఆరా జిల్లాలో 'ఓట్ అధికార్ యాత్ర' కార్యక్రమంలో భాగంగా ఈ వ్యాఖ్యలు చేశారు. అదేవేదికపై రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్‌లు ఉన్నా తేజస్వి వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. సీఎం అభ్యర్థిని తానేనంటూ తేజస్వీ యాదవ్ వారి సమక్షంలో ప్రకటించగా వారు మాత్రం చప్పుడు చేయలేదు. ముఖ్యంగా రాహుల్ గాంధీ మాత్రం దీనిపై నోరు మెదపలేదు. అలాగే నితీశ్ కుమార్ ప్రభుత్వంపై తేజస్వీ యాదవ్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ అయినప్పటికీ బీహార్‌లో ఆర్జేడీదే పైచేయి అని తెలిపారు. మీకు కాపీ కొట్టే సీఎం కావాలా, ఒరిజినల్ ముఖ్యమంత్రి కావాలా అంటూ ఆరాలో జరిగిన ర్యాలీలో తేజస్వీ యాదవ్ మాట్లాడతూ తాను ప్రకటించిన సంక్షేమ పథకాలనే సీఎం నితీశ్ కుమార్ అమలు చేస్తు న్నారని ఆరోపించారు. ముందు నేను వెళ్తుంటే ప్రభుత్వం వెనుక వస్తోందని ఎద్దేవాచేసారు. ఈ సభలోనే ప్రజలను ఓ సూటి ప్రశ్న అడిగారు. మీకు కాపీ కొట్టే సీఎం కావాలా? ఒరిజినల్ సీఎం కావాలా? అంటూ ప్రశ్నించారు. అలాగే మహా ఘట్‌బంధన్ తరఫున సీఎం అభ్యర్థిని తానేనని తేజస్వి మరోసారి నొక్కి చెప్పారు. అయితే రెండోసారి చెప్పినప్పుడు కూడా రాహుల్ గాంధీ మౌనంగానే ఉండిపోయారు. బీహార్‌లో ఆర్జేడీదే కీలక పాత్ర పోషిస్తోంది. బీహార్‌లో కాంగ్రెస్ కంటే ఆర్జేడీ పెద్దన్న పాత్ర పోషిస్తుందని తేజస్వీ పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కంటే తమ పార్టీకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని ఆయన చెప్పకనే చెప్పారు. తేజస్వీ ప్రకటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ సమక్షంలోనే ఆయన ఈ కామెంట్లు చేయగా వీరిద్దరూ నోరు మెదపకపోవడం గమనార్హంగా నిలిచింది. ముఖ్యంగా తేజస్వీ యాదవ్ మొదటి నుంచీ నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని తప్పు పడుతూనే వస్తున్నారు. తీవ్ర విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. పదవీ విరమణ వయసు 60 ఏళ్లేనని మరి 75 ఏళ్ల సీఎం అవసరమా అంటూ వ్యాఖ్యానించారు. నితీష్ కుమార్ సీఎం పదవి నుంచి తొలగిపోవాలంటూ పదే పదే డిమాండ్ చేశారు.



## దేశ భద్రతపై రాజీపడుతున్న ప్రధాని మోడీ

### జిన్‌పింగ్‌తో మోడీ భేటీపై కాంగ్రెస్‌నేత ఫైర్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1 :** ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఆదివారం టియాంజిన్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిగిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. చైనా పట్ల మోదీ సర్కార్ అనుసరిస్తున్న మెతక వైఖరిని ఎండగడుతూ, దేశ భద్రత విషయంలో రాజీ పడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. చైనా దూకుడుకు, బెదిరింపులకు తలొగ్గడమే భారత కొత్త భద్రతా విధానమా అని సూటిగా ప్రశ్నించింది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా ప్రభుత్వ విధానాలను తప్పుబట్టారు. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో 20 మంది భారత సైనికులు ప్రాణత్యాగం చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఆ త్యాగాలను విస్మరించి చైనాతో రాజీకి ప్రయత్నించడం దారుణమని విమర్శించారు. చైనా దురాక్రమణను గుర్తించడానికి బదులుగా, ప్రధాని మోదీ వారికి క్లీన్ చిట్ ఇచ్చారని ఆయన ఆరోపించారు. సరిహద్దుల్లో యథాతథ స్థితిని పూర్తిగా పునరుద్ధరించాలని ఆర్మీ చీఫ్ కోరుతున్నప్పటికీ, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా చైనాతో సయోధ్యకు మొగ్గుచూపడం వారి దురాక్రమణను చట్టబద్ధం చేయడమేనని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌తో చైనా కుమ్మక్కైన తీరును మన ఆర్మీ డిప్యూటీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ జూలై 4న స్పష్టంగా వివరించారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. ఈ అపవిత్ర పొత్తుపై స్పందించాల్సింది పోయి, మోదీ ప్రభుత్వం దానిని మౌనంగా అంగీకరించి ఇప్పుడు చైనాకు రాచమర్యాదలుచేస్తోందని ఆయన ఆక్షేపించారు.

## యుపిఎస్‌సి మెరిట్ అభ్యర్థులకోసం 'ప్రతిభాసేతు' పోర్టల్

### మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ,సెప్టెంబరు1:** మెరిట్ జాబితాలో అవకాశం పొందలేకపోయిన ప్రతిభావంతుల కోసం కేంద్ర ప్రభుత్వం 'ప్రతిభా సేతు' పోర్టల్ ప్రారంభిస్తున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. వేలాది మంది సివిల్స్ ఆశావహ అభ్యర్థుల ప్రతిభకు ఇదొక వారధి లాంటిదని ప్రశంసించారు. యుపిఎస్‌సిలో ప్రిలిమ్స్, మెయిన్స్ అన్నీ క్లియర్ చేసినప్పటికీ తుది జాబితాలో అవకాశం చేజార్చుకున్న వారికి రెండవ ఛాన్స్ ఇచ్చేందుకు ఈ టాలెంటెడ్ పోర్టల్ ఉపకరిస్తుందని సివిల్స్ అభ్యర్థులకు ఇదొక ఆశాకిరణమని ఆయన అభివర్ణించారు. 125వ మన్ కీ బాత్ రేడియో కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యూపీఎస్సీ అభ్యర్థులను ఉద్దేశిస్తూ ఈ కీలక ప్రకటన చేశారు. దేశంలో అత్యంత కఠినమైన పరీక్షలలో ఒకటైన సివిల్ సర్వీసెస్ పరీక్షను యూపీఎస్సీ (యుపిఎస్‌సి) నిర్వహిస్తుంది. ఎంత ప్రతిభాపాటవాలు ఉన్నప్పటికీ పరిమిత అవకాశాల కారణంగా ఏటా వేలాది మంది అభ్యర్థులు తుది జాబితాలో చోటు సాధించలేక పోతున్నారు. ఈ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు విలువైన సమయం, శ్రమ, డబ్బు వెచ్చిస్తారు. ఏళ్ల తరబడి కఠినంగా శ్రమించి విజయపు టంచులకు చేరినప్పటికీ చివరి క్షణాల్లో ఎందరో ప్రతిభావంతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఇలాంటి వారి కోసమే కేంద్ర ప్రభుత్వం ఒక డిజిటల్ ప్లాట్‌ఫామ్ తీసుకొచ్చింది. అదే 'ప్రతిభా సేతు'. మన్ కీ బాత్ 125వ ఎడిషన్‌లో ప ప్రతిభా సేతు గురించి ప్రస్తావించారు. ఇందులో యూపీఎస్సీలో వివిధ పరీక్షల్లో అన్ని దశల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల డేటాను సేవ్ చేస్తుంది. అర్హత గల అభ్యర్థుల వివరాలను ప్రతిభా సేతు పోర్టల్‌లో నమోదు చేస్తారు. తుది మెరిట్ జాబితాలో చోటు సంపాదించలేని వారి వివరాలను ప్రైవేట్ కంపెనీలకు అందుబాటులో ఉంచుతుంది. ఈ పోర్టల్ లోని సమాచారం ఆధారంగా కార్పొరేట్ కంపెనీలు భారీ జీతాలు ఇచ్చి సివిల్స్ అభ్యర్థులకు కొలువు ఆఫర్ చేస్తాయని ప్రధాని మోదీ వెల్లడించారు.

# నేను బతికే ఉన్నా..

## సోషల్‌మీడియా వైరల్‌కు ఫుల్‌స్టాప్ పెట్టిన ట్రంప్



**వాషింగ్టన్, సెప్టెంబరు 1 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరణించారంటూ సోషల్ మీడియాలో వ్యాపించిన వదంతులకు ఎట్టకేలకు తెరపడింది. కొన్ని రోజులుగా ఆయన ప్రజల ముందుకు రాకపోవడంతో మొదలైన ఊహాగానాలు తీవ్రరూపం దాల్చాయి. అయితే, శనివారం ఉదయం ఆయన వైట్‌హౌస్‌లో ప్రత్యక్షమవ్వడంతో ఈ పుకార్లన్నీ అబద్ధమని తేలిపోయింది. ఐదురోజుల క్రితం జరిగిన క్యాబినెట్ సమావేశం తర్వాత ట్రంప్ మళ్లీ బహిరంగంగా కనిపించలేదు. దీనికి తోడు, వారాంతంలో అధ్యక్షుడికి ఎలాంటి అధికారిక కార్యక్రమాలు లేవని వైట్‌హౌస్ షెడ్యూల్ విడుదల చేయడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. దీంతో శుక్రవారం రాత్రి నుంచి హ్యాష్‌ట్యాగ్‌లు ఎక్స్‌లో విపరీతంగా ట్రెండ్ అయ్యాయి. ట్రంప్ ఆరోగ్యంపై రకరకాల కుట్ర సిద్ధాంతాలు నెట్టింట చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 8:45 గంటల సమయంలో ట్రంప్ వైట్‌హౌస్‌లో కనిపించారు. తెల్లటి పోలో షర్ట్, నల్ల ప్యాంటు, ఎర్రటి మాగా టోపీ ధరించి, తన మనవరాళ్లు కై ట్రంప్, స్పెన్సర్ ఫ్రెడరిక్ ట్రంప్‌లతో కలిసి వర్జీనియాలోని స్టెర్లింగ్‌లో ఉన్న తన గోల్ఫ్ క్లబ్‌కు బయలుదేరారు. దీంతో ఆయన ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉన్నారని స్పష్టమైంది. అంతకుముందు కూడా ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో యాక్టివ్‌గా ఉన్నారు. అమెరికా వాణిజ్య విధానాలకు సంబంధించి ఫెడరల్ అప్పీల్స్ కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన స్పందించారు. అన్ని టారిఫ్‌లు ఇంకా అమలులోనే ఉన్నాయి. పక్షపాతంతో కూడిన కోర్టు వాటిని తొలగించాలని చెప్పినా, అంతిమంగా అమెరికానే గెలుస్తుంది. ఈ సుంకాలను ఎత్తేస్తే దేశానికి పెను నష్టం జరుగుతుందని ఆయన పోస్ట్ చేశారు. ఇదే సమయంలో డైలీ కాలర్ వైట్‌హౌస్ కరస్పాండెంట్ రీగన్ రీస్ కూడా ఈ వదంతులను ఖండించారు. నేను నిన్న మధ్యాహ్నం అధ్యక్షుడితోనే ఉన్నాను. ఆయన్ను గంటపాటు ఇంటర్వ్యూ చేశాను. ఆయన చనిపోయారని లేదా అనారోగ్యంతో ఉన్నారని ప్రచారం జరగ డం ఆశ్చర్యంగా ఉందని ఆమె తెలిపారు. మొత్తానికి, ట్రంప్ ప్రత్యక్షం కావడంతో ఈ వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది.

# సరిహద్దు వివాదాలతో మరుగునపడిన పంచశీల ఒప్పందం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1 :** భారత్‌చైనా సంబంధాల గురించి చర్చ వచ్చినప్పుడల్లా 'పంచశీల ఒప్పందం' ప్రస్తావనకు వస్తున్నది. 'హిందీచీనీ భాయ్ భాయ్' నినాదాలతో స్నేహానికి ప్రతీకగా మొదలైన ఈ ఒప్పందం, చివరికి రెండు దేశాల మధ్య యుద్ధానికి దారితీయడం ఒక చారిత్రక విషాదం. సుమారు 70 ఏళ్ల క్రితం జరిగిన ఈ ఒప్పందం వెనుక ఎన్నో ఆశలు, రాజీలు, ఆ తర్వాత తీవ్ర పరిణామాలు ఉన్నాయి. 1954లో అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చైనాలో పర్యటించారు. మావో జెడాంగ్ నేతృత్వంలో చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఆ దేశాన్ని సందర్శించిన తొలి కమ్యూనిస్టేతర నేత నెహ్రూనే. తన కుమార్తె ఇందిరా గాంధీతో కలిసి చైనాకు వెళ్లిన ఆయనకు చైనా ప్రభుత్వం అపూర్వ స్వాగతం పలికింది. బీజింగ్, షాంఘై వంటి నగరాల్లో పర్యటించిన నెహ్రూ.. అమెరికా, సోవియట్ యూనియన్ కూటములతో సంబంధం లేకుండా ఆసియా దేశాల మధ్య శాంతియుత సంబంధాలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య కొత్త స్నేహానికి నాంది పలుకుతుందని ఆయన బలంగా విశ్వసించారు. నెహ్రూ పర్యటనకు రెండు నెలల ముందు, అంటే 1954 ఏప్రిల్ 29న, టిబెట్ ఒప్పందంలో భాగంగా భారత్‌చైనా మధ్య పంచశీల ఒప్పందం కుదిరింది. భారత రాయబారి ఎన్. రాఘవన్, చైనా ప్రతినిధి చాంగ్ హాన్‌పు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఒకరి సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను మరొకరు గౌరవించుకోవడం. పరస్పరం దురాక్రమణలకు పాల్పడకపోవడం. ఒకరి అంతర్గత వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకపోవడం. సమానత్వం, పరస్పర ప్రయోజనాల కోసం పనిచేయడం. శాంతియుత సహజీవనం. అయితే, ఈ ఒప్పందంలో భారత్ ఒక చారిత్రక రాజీకి తలొగ్గాల్సి వచ్చింది. టిబెట్‌ను చైనాలోని టిబెట్ ప్రాంతంగా అంగీకరించి, దానిపై చైనా సార్వభౌమత్వాన్ని అధికారికంగా గుర్తించింది. శాంతి మంత్రంలా కనిపించిన ఈ ఒప్పందం వెనుక చర్చల సమయంలోనే తీవ్ర భేదాభిప్రాయాలు తలెత్తాయి. ముఖ్యంగా హిమాలయాల్లోని వ్యాపార, యాత్రా మార్గాల విషయంలో చైనా మొండిగా వ్యవహరించింది. భారత్ ప్రతిపాదించిన పలు సరిహద్దు మార్గాలను తిరస్కరించింది. లడక్‌లోని డెమ్‌చోక్ మార్గాన్ని చేర్చాలన్న భారత అభ్యర్థనను కూడా తోసిపుచ్చింది. ఈ ఒప్పందం 1962 జూన్‌లో ముగిసింది. ఆ తర్వాత కొద్ది నెలలకే అక్సాయి చిన్, మెక్‌మహాన్ లైన్ వంటి సరిహద్దు ప్రాంతాలపై వివాదాలు ముదిరి రెండు దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధానికి దారితీశాయి. దీంతో పంచశీల సూత్రాలు కాగితాలకే పరిమితమై, ఇరు దేశాల సంబంధాల్లో తీవ్రమైన అవనమ్మకానికి బీజం పడింది.



## నిశ్చితార్థంకోసం రమ్మని వరుడిని చితకబాదిన వధువు కుటుంబీకులు

### చికిత్సపొందుతూ వరుడు మృతి

**ముంబయి,సెప్టెంబరు 1:** మహారాష్ట్రలోని పూణేలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రేమ పేరుతో తమ అమ్మాయిని వలలో వేసుకున్నాడనే కోపంతో ఓ కుటుంబం ఘోరానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పింప్రి చించ్వాడ్ లోని సాంఘ్వి ఏరియాకు చెందిన ఓ యువతి స్థానిక యువకుడు రమేశ్ ఘెంగాత్ ను ప్రేమించింది. ఈ విషయం తెలిసి యువతి కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలిపారు. రమేశ్‌పై రేప్ కేసు నమోదైందని, పోస్కో కేసులోనూ నిందితుడని కూతురుకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా కూతురు పట్టువిడవకపోవడంతో గత్యంతరం లేక పెళ్లికి ఒప్పుకున్నారు. పెళ్లి కుదుర్చుకునేందుకు రమ్మంటూ రమేశ్ కుటుంబాన్ని ఇంటికి ఆహ్వానించారు. తల్లిదండ్రులను వెంటబెట్టుకుని వచ్చిన రమేశ్‌ను యువతి కుటుంబ సభ్యులు నిలదీశారు. ప్రేమ పేరుతో తమ కూతురును వలలో వేసుకున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తులైన యువతి కుటుంబ సభ్యులు రమేశ్‌ను గదిలోకి లాక్కెళ్లి చితకబాదారు. తీవ్ర గాయాలతో రమేశ్ స్పృహ తప్పడంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ రమేశ్ మరణించాడు. రమేశ్ తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువతి కుటుంబ సభ్యులు 9 మందిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారికోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# సంక్షిప్తంగా..

## ఎంపి మహువా మొయిత్రాపై కేసు నమోదు



**నయారాయ్‌పూర్, సెప్టెంబరు 1 :** కేంద్ర హోంమంత్రి అమిత్ షా పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా పై కేసు నమోదు చేశారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను నిరోధించడంలో విఫలమయ్యారంటూ అమిత్‌షా పై మహువా మొయిత్రా ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యల నేపథ్యంలో మహువాపై కేసు నమోదైంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు రాయ్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంపీ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, రాజ్యాంగ విరుద్ధమని ఆ నాయ కుడు పేర్కొన్నాడు. 1971 సమయంలో రాయ్‌పూర్‌లోని మానా క్యాంప్ ప్రాంతంలో అనేక మంది బంగ్లాదేశీ శరణార్థులు స్థిరపడ్డారని, మహువా వ్యాఖ్యలు వారిలో భయాందోళనలు రేకెత్తించాయని తెలిపాడు. అంతకుముందు పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణా నగర్ కొత్వాలీ పోలీస్ స్టేషన్‌లోనూ ఆమెపై ఫిర్యాదు దాఖలైంది.

## టేకాఫ్.. అంతలోనే తిరిగొచ్చిన ఎయిరిండియా విమానం




**న్యూఢిల్లీ, సెప్టెంబరు1:** దేశ రాజధాని ఢిల్లీ నుంచి ఇండోర్ కు వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఢిల్లీకి తిరిగి వచ్చింది. విమానం కుడి ఇంజిన్‌లో మంటలు రేగినట్లు సూచన అందుకున్న పైలట్ ఆ విమానాన్ని వెంటనే ఢిల్లీకి మళ్లించినట్లు ఎయిరిండియా తెలిపింది. ఢిల్లీకి తిరిగొచ్చిన విమానాన్ని తనిఖీల కోసం నిలిపివేశామని అధికారులు చెప్పారు. ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానంలో ఇండోర్‌కు తరలించామని ఎయిరిండియా అధికారులు తెలిపారు. ఆగస్టు 31న ఢిల్లీ నుంచి ఇండోర్‌కు బయలుదేరిన విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఢిల్లీకి తిరిగొచ్చింది. కాక్‌పిట్ సిబ్బందికి ఇంజిన్‌లో మంటలు వస్తున్నట్లు సూచన అందింది. ప్రామాణిక విధానాన్ని అనుసరించి, కాక్‌పిట్ సిబ్బంది ఇంజిన్‌ను ఆపేయాలని నిర్ణయించుకుని ఢిల్లీకి తిరిగొచ్చారు.

## విమానం గాల్లో ఉండగా టాయిలెట్లలో సమస్య..




**కాన్‌బెర్రా, సెప్టెంబరు 1 :** బాలి నుంచి బ్రిస్బేన్‌కు వెళ్తున్న విమానంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విమానం గాల్లో ఉన్న సమయంలో టాయిలెట్లతో సమస్య తలెత్తడంతో ప్రయాణికులకు నీళ్ల బాటిళ్లలో మూత్ర విసర్జన చేయాల్సి వచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంతర్జాతీయ మీడియా తెలిపిన వివరాల ప్రకారం.. వర్జిన్ ఆస్ట్రేలియా బోయింగ్ (737 మాక్స్ 8) విమానం గురువారం మధ్యాహ్నం బాలిలోని డెన్‌పసర్ విమానాశ్రయం నుంచి బ్రిస్బేన్‌కు బయల్దేరింది. టేకాఫ్ తర్వాత అందులోని పలు టాయిలెట్లలో సమస్య ఉండడాన్ని సిబ్బంది గుర్తించారు. మొత్తం ఆరు గంటలు కాగా మొదటి మూడు గంటలు ప్రయాణికులు ఒక్క బాత్రూమ్‌నే వినియోగించుకున్నారు. మూడు గంటల తర్వాత అందులో కూడా సమస్య తలెత్తడంతో నీళ్ల బాటిళ్లలో మూత్ర విసర్జన చేయాలని విమానసిబ్బంది ప్రయాణికులకు సూచించారు. దీంతో ప్రయాణికులు విమాన సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

# రష్యానుంచి కొనుగోళ్లు.. ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తున్న భారత్

## 'నాఫ్టోరైనోక్' గణాంకాల జాబితా విడుదల



**కీవ్, సెప్టెంబరు 1 :** ఉక్రెయిన్‌రష్యా యుద్ధం నేపథ్యం లో భారత్ వైఖరిని అమెరికా నిందిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ, ఉక్రెయిన్ పై పోరాడేందుకు అవసరమైన డబ్బును ఆ దేశానికి అందిస్తోందని అమెరికా కన్నెర్ర చేస్తోంది. అగ్రరాజ్యం ఇప్పటికే అదనపు సుంకంతో కలిపి భారత్ పై 50 శాతం సుంకాలు విధించింది. ఈ నేపథ్యంలో, అత్యంత ఆసక్తికరమైన అంశం వెల్లడైంది. భారత్ ఒకవైపు రష్యా నుంచి భారీగా ముడి చమురును కొనుగోలు చేస్తూనే, మరోవైపు అదే చమురును శుద్ధి చేసి యుద్ధంతో సతమతమవుతున్న ఉక్రెయిన్‌కు అతిపెద్ద డీజిల్ సరఫరాదారుగా నిలిచింది. అమెరికాలోని కొందరు విమర్శిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థకు, సైనిక అవసరాలకు భారత ఇంధనమే కీలకంగా మారింది. ఉక్రెయిన్‌కు చెందిన చమురు మార్కెట్ విశ్లేషణ సంస్థ 'నాఫ్టోరైనోక్' విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2025 జులై నెలలో ఉక్రెయిన్‌కు అత్యధికంగా డీజిల్ సరఫరా చేసిన దేశంగా భారత్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ నెలలో ఉక్రెయిన్ వినియోగించిన మొత్తం డీజిల్‌లో 15.5 శాతం వాటా భారత్‌దే కావడం గమనార్హం. సగటున రోజుకు 2,700 టన్నుల డీజిల్‌ను భారత్ నుంచి ఉక్రెయిన్ దిగుమతి చేసుకుంది. ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు ఉక్రెయిన్‌కు భారత డీజిల్ ఎగుమతులు 10.2 శాతానికి పెరిగాయి. 2024లో ఇదే కాలంలో ఇది కేవలం 1.9 శాతంగా మాత్రమే ఉంది. భారత్ నుంచి శుద్ధి చేసిన ఈ డీజిల్ రొమానియా, తుర్కియే దేశాల ద్వారా ఉక్రెయిన్‌కు చేరుతోంది. యుద్ధం కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ఉక్రెయిన్ నగరాలు, రవాణా వ్యవస్థ, యుద్ధ క్షేత్రాలు నడవడానికి ఈ ఇంధన సరఫరా అత్యంత కీలకంగా మారింది. భారత్‌తో పాటు స్లోవాకియా, గ్రీస్, తుర్కియే, లిథువేనియా వంటి దేశాలు కూడా ఉక్రెయిన్‌కు ఇంధనాన్ని అందిస్తున్నాయి. అయితే, అమెరికాలోని ట్రంప్ కార్యవర్గానికి చెందిన పీటర్ నవారో వంటి కొందరు, రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్ యుద్ధాన్ని పరోక్షంగా ప్రోత్సహిస్తోందని ఆరోపణలు చేస్తున్నారు. కానీ, అదే రష్యా చమురుతో నడుస్తున్న ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తోంది. గతంలో అమెరికా ఆంక్షల వల్ల ఇరాన్, వెనిజులా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసిన భారత్, ఇప్పుడు రష్యా విషయంలో కూడా అదే పనిచేస్తే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## ఎయిర్‌ఫోర్స్‌కు రెండు తేజాస్ జెట్ విమానాలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1 :** తేజస్ యుద్ధ విమానాల డెలివరీలో జాప్యం జరుగుతోందంటూ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ గతంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. సెప్టెంబర్ నెలాఖరు కల్లా రెండు తేజస్ ఎమ్‌కే1ఏ యుద్ధ విమానాలను హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) ఎయిర్‌ఫోర్స్‌కు అందజేయనుంది. ఈ విషయాన్ని డిఫెన్స్ సెక్రెటరీ ఆర్‌కే సింగ్ వెల్లడించారు. ఆ తరువాత మరో 97 తేజస్ యుద్ధ విమానాల డెలివరీకి ఎయిర్ ఫోర్స్‌తో హెచ్ఏఎల్ ఒప్పందం కుదుర్చుకుం టుందని కూడా తెలిపారు. పూర్తిస్థాయి వెపన్స్ (ఆయుధాలు) ఇంటెగ్రేషన్‌తో ఈ రెండు తేజస్ యుద్ధ విమానాలు డెలివరీ అవ్వొచ్చని అన్నారు. ఇప్పటికే హెచ్ఏఎల్, ఎయిర్‌ఫోర్స్ మధ్య యుద్ధ విమానాల డెలివరీకి ఒప్పందం ఉంది. అయితే, విమానాల తయారీలో జాప్యంపై ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఇటీవల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ఎస్ఆర్ఎంలో వ్యాపారావకాశాలు- సామాజిక బాధ్యతల సదస్సు



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్)** :ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో శని, ఆదివారాల్లో గ్లోబల్ సోషల్ ఎంటర్ప్రెన్యూర్ అండ్ సీఎస్ఆర్ సమ్మిట్ జరిగింది. దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ కంపెనీల పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, విద్యా సంబంధ మేధావులు, పలువురు పెట్టుబడిదారులు సదస్సుకు హాజరయ్యారు. యూనివర్సిటీ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ డైరెక్టర్ సిద్ధార్థ త్రిపాఠి సదస్సు ను ప్రారంభించి సమ్మిట్ ఉద్దేశాన్ని వివరించారు. ఆదిత్రి కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళలకు అందించిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా నాలుగు అంశాల్లో బృంద చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో ఇంపాక్ట్ సంస్థ ఫౌండర్ ఆయూష్ బల్లా, దివినా కమల్, బిఎంఎల్ ముంజాల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆనిజిత్ చక్రవర్తి తదితరలు పాల్గొని ఎంటర్ ప్రెన్యూర్, సీఎస్ఆర్ కార్యక్రమాలపై చర్చించారు. ఉత్తను పరిశోధనా పత్రాలను సమర్పించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. వీఐటీ యూనివర్సిటీ, ఎస్ఆర్ఎం వర్సిటీ, హాఫ్ బ్రెయిన్ టెక్నాలజీస్ సంస్థలు ఈ బహుమతులను గెల్చుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామీణ మహిళల వృత్తి శక్షణ కు సంబంధించిన 'ది రెడ్ బుక్ ఆఫ్ ఇన్స్పిరేషన్" అనే పుస్తకాన్ని యూనివర్సిటీ వైస్ ఛాన్స లర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా వేదికపై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియా,పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి హోల్ సేల్ కూరగాయల మార్కెట్ నందు వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన నిమజ్జన కార్యక్రమం సందర్భంగా సోమవారం మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు తిరుమల శెట్టి కొండలరావు పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో వినాయకుని వేడుకలు నిర్వహించిన నిర్వాహకులను తిరుమల శెట్టి కొండలరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో కూరగాయల వ్యాపారస్తులు రైతులు భక్తులు పాల్గొన్నారు.

**దుగ్గిరాలలో గణేష్ నిమజ్జనం**

దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో జరిగిన గణేష్ నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం జరిగింది. మానవ సేవా సమితి అధ్యక్షులు వంగర సురేష్, ధోనీసేన నాయకులు తిరుమలశెట్టి కొండలరావు రంగిశెట్టి ఫౌండేషన్ అధినేత రంగిశెట్టి రమేష్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## యర్రబాలెంలో గణేశుని ఉత్సవాలు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** యర్రబాలెం వేప చెట్టు సెంటర్లో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల గణపతి విగ్రహం వద్ద స్వామివారి ఉత్సవాలలో భాగంగా ఐదో రోజైన ఆదివారం రాత్రి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సుమారు 3000 మందికి అన్నదానం నిర్వహించారు. అన్నదానంకు మూడు క్వింటాల బియ్యం అందజేసిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కు యూత్ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ యువజన అధ్యక్షులు ఆలా శివాజీ, టీడీపీ నాయకులు చావలి ఉల్లయ్య, దానబోయిన శంకర్, ఆలా వెంకట నారాయణ, కాజ గోపి, గ్రామ పెద్దలు దానబోయిన నాగయ్య, గొల్లపూడి సుబ్బారావు, ఆలా కృష్ణ, రుద్రు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

## నేత్ర దానం చేసిన పాలేరు.సతీష్



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):**మండల పరిధిలోని కొండపాటూరు గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ కార్యకర్త పాలేరు.సతీష్ అనారోగ్య సమస్యతో సోమవారం నాడు చికిత్స పొందుతూ గుంటూరు వైద్యశాల నందు తుది శ్వాస విడిచారు.ఆయన మరణాంతరం మరొకరి జీవితాలలో వెలుగు నింపాలనే దృఢ సంకల్పంతో ఆయన కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ మృతుని నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు.తమ కుటుంబ పెద్దను కోల్పోయిన అతని నేత్రాలతో మరొకరికి జీవితాన్ని నిలబెట్టడం పట్ల పలువురు అభినందించారు.సతీష్ తొలి నుండి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అందరూ సంతోషంగా ఉండాలని ఆకంక్షించేవారని అన్నారు.ఆయన అకాల మరణం పట్ల పలువురు నివాళులర్పించారు.వ్యక్తి మరణాంతరం నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులకు పలువురు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

# గుంటూరు పశ్చిమలో పెన్షన్ల పండుగ

○ **అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు - ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 44వ డివిజన్ నాయుడుపేట 5వ లైన్లో సోమవారం పండుగ వాతావరణంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి స్వయంగా పాల్గొని పెన్షన్ దారులకు నగదు, లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. వినాయక మండపాలను సందర్శించి ఆశీస్సులు పొందిన అనంతరం ప్రజల వద్దకు చేరుకుని కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలితాలు సకాలంలో అందుతున్నాయా, మౌలిక సదుపాయాల కల్పన సంతృప్తికరంగానే ఉందో నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ "ఆర్థిక సవాళ్లు ఎంత ఉన్నా కూటమి ప్రభుత్వం సాటిలేని సంక్షేమాన్ని అందిస్తోంది" అని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ నగదును రూ. 4,000కు పెంచి ప్రతి నెల ఒకటవ తేదీన సమయానికి అందిస్తున్నామన్నారు. ఒకటవ తేదీ రాగానే పెన్షన్ దారుల ముఖాల్లో వెలిగే ఆనందం మా ప్రభుత్వ కర్తవ్య నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. కొన్ని చోట్ల అనర్హులు, బహుళ అంతస్తుల్లో నివసించే వారు కూడా పెన్షన్ పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆర్థికంగా బలమైన వారు స్వచ్ఛందంగా పెన్షన్ రద్దు చేసుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా నిలవాలని పిలుపునిచ్చారు.

అదేవిధంగా... సెప్టెంబర్ 15 నాటికి స్మార్ట్ రేషన్ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని, క్యూఆర్ కోడ్ సౌకర్యంతో కూడిన ఈ కార్డును స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారుడు సరుకులు తీసుకున్న వివరాలు వెంటనే ప్రభుత్వానికి చేరతాయని, దీంతో పంపిణీలో పూర్తి పారదర్శకత వస్తుందని తెలిపారు. పోర్టబులిటీ విధానం ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే సౌకర్యం కల్పించామని, ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రతి కుటుంబం రేషన్ పొందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. "అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేరాలన్నదే మా కర్తవ్యము. అభివృద్ధి %-% సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు, పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ ప్రజల ఆదరణతో ముందుకు వెళ్తాం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, పరిశీలకులు సింహాద్రి కనకాచారి, భద్రయ్య, కొమ్మినేని కోటేశ్వరరావు, పవన్ వెంకీ, యర్రకుల శ్రీనివాస్, నూతలపాటి సాంబశివరావు,కడియాల శ్రీదేవి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి పైప్‌లైన్ పనుల వేగవంతం - కమిషనర్ ఆదేశాలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**నగరంలోని నెహ్రూ నగర్ పంప్ హౌస్, సంజీవయ్య నగర్ రైల్వేగేటు వద్ద జరుగుతున్న త్రాగునీటి పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన పనులను స్వయంగా పరిశీలించి, ఇంజినీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు.

కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను ప్రారంభించామని, అవి పూర్తయితే నగరానికి త్రాగునీటి సరఫరాలో మెరుగైన ఫలితాలు దక్కుతాయని తెలిపారు. పనులను వేగవంతం చేసేందుకు ఇప్పటికే ఇంజినీరింగ్ అధికారులకు షిఫ్ట్‌ల వారీగా విధులు కేటాయించామని, ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున పనులు ఆగిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈఈలు, డీఈఈలు పనులు జరుగుతున్న ప్రాంతంలోనే ఉండి పర్యవేక్షణ చేయాలని, నిర్ణీత గడువుకంటే ముందే పూర్తి చేసి త్రాగునీటి సరఫరా యథావిధిగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టంచేశారు. అనంతరం ఆయన పలు ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ప్రతి ఇంటి నుండి తడి, పొడి వ్యర్థాలను వేరుగా సేకరించాలని, ఈ విషయంపై కార్మికులు, కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

రోడ్లపై, డ్రైన్లపై ఆక్రమణలు లేకుండా చూడాలని, ఈ బాధ్యతను సచివాలయ ప్రణాళిక కార్యదర్శులు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## చరిత్రలో లేని విధంగా ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** చరిత్రలో లేని విధంగా మంగళగిరి నియోజకవర్గానికి మంత్రి నారా లోకేష్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేయిస్తున్నారని మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరి మండలం, చినకాకానికి చెందిన గడ్డిపాటి తులసీ హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్‌లో గత కొంత కాలంగా చికిత్స పొందుతున్నారు. పేద కుటుంబానికి చెందిన వారు కావడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. స్థానిక నాయకులు వారి ఆర్థిక పరిస్థితిని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన సీఎం చంద్రబాబు నాయుడుతో మాట్లాడి గడ్డిపాటి తులసీ వైద్య ఖర్చులు కోసం రూ. 15 లక్షలు మంజూరు చేయించారు. స్థానిక నాయకులు సోమవారం గడ్డిపాటి తులసీకి ఇంటికి వెళ్లి రూ. 15 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) మంజూరు పత్రాన్ని అందజేశారు. ఎల్‌వోసీ మంజూరుకు కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పల్లబోతుల శ్రీనివాసరావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలోని పేద ప్రజలకు ఆస్పత్రి ఖర్చులు భారం కాకూడదని మంత్రి నారా లోకేష్ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లక్షల విలువైన చెక్కులు అందజేసి ఆదుకోవడం అభినందనీయమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం సంరక్షణకు పూర్తి భరోసా కల్పిస్తోం దన్నారు. నియోజకవర్గంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు మంత్రి నారా లోకేష్ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం త్వరితగతిన మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఎంతో మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గాదే పిచ్చిరెడ్డి, చినకాకాని గ్రామ పార్టీ అధ్యక్షులు గుమ్మా హరిబాబు, బొర్రా కిరణ్ కుమార్, చాగర్లమూడి నరేంద్ర కుమార్, పలగాని వెంకట నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ చొరవతో ప్రజల సౌకర్యార్థం ఈ -టాయిలెట్స్ ఏర్పాటు

○ **నగర కమిషనర్ అలీంబాషా**



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరి -తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో గౌతమ్ బుద్ధ రోడ్డు వెంబడి కాళికామాత ఆలయం వద్ద ప్రజల సౌకర్యార్థం ఈ -టాయిలెట్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని నగర కమిషనర్ అలీం బాషా అన్నారు. సెల్కాన్ సీఎస్సార్ నిధులతో ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ లూకేఫ్ ఏర్పాటు చేసిన ఈ -టాయిలెట్స్ ను ఆదివారం ఆయన టీడీపీ నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ అలీంబాషా మాట్లాడుతూ... మంత్రి నారా లోకేష్ చొరవతో రాష్టంలో నే మొట్టమొదటి ఈ -టాయిలెట్స్ ను సెల్కాన్ సీఎస్సార్ నిధులతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పురుషులు, మహిళలతో పాటు దివ్యాంగులు సైతం ఈ -టాయిలెట్ లను వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ -టాయిలెట్ లు హైదరాబాద్, ఢిల్లీ వంటి పెద్ద పెద్ద నగరాల్లో ఇప్పటికే ఉన్నాయని,మంత్రి లోకేష్ చొరవతో మంగళగిరిలో తొలిసారిగా ఈ -టాయిలెట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే ఆర్టీసీ బస్టాండ్, పెట్రోల్ బంక్, నులకపేట అన్న క్యాంటీన్ వద్ద ఈ -టాయిలెట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇక ఈ -టాయిలెట్ ఎదుట కాఫీ షాప్ తో పాటు క్లాత్ బ్యాగ్స్, జ్యూట్ బ్యాగ్స్, మొక్కజొన్నతో తయారు చేసిన డిస్పోజ బుల్ గ్లాస్ క్యారీ బ్యాగ్ లను విక్రయించేందుకు సైతం పర్మినెంట్ గా స్టాల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు,పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్,టీటీడీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి,ఏపీ స్వచ్ఛాంధ్ర మిషన్ కార్పోరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి,రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివ శేషగిరిరావు టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుత్తికొండ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే నిరుద్యోగంలో ఏపీకి మూడో చోటు ... కూటమి ప్రభుత్వానికిది సిగ్గు చేటు!

○ **వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**దేశంలోనే అత్యధిక నిరుద్యోగులు గల రాష్ట్రాల జాబితాలో మన రాష్ట్రం మూడో చోటు ఆక్రమించడం సిగ్గు చేటని వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య వ్యాఖ్యానించారు. జాతీయ స్థాయిలో నిరుద్యోగితా శాతం 14.6 శాతం ఉంటే... మన రాష్ట్రంలో అది 21 శాతంగా నమోదవడం కూటమి ప్రభుత్వ విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలకు ప్రత్యక్ష నిదర్శనమని ఆయన నిందించారు.

సోమవారం పానుగంటి చైతన్య మీడియాతో మాట్లాడుతూ, కూటమి పాలనపై, ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిపై నిప్పులు చెరిగారు. బాబొస్తే జాబొస్తుందనీ.. 20లక్షల ఉద్యోగాలతో రాష్ట్రంలో నిరుద్యోగం నిర్మూలిస్తామనీ.. ఒకవేళ ఉద్యోగం కల్పించలేని పక్షంలో నెలనెలా మూడు వేల రూపాయల భృతి చెల్లిస్తామనీ.. మాయమాటలు చెప్పి చంద్రబాబు గద్దెనెక్కారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది పాలన పూర్తయినా ఎక్కడా ఒక్క ఉద్యోగం కూడా కల్పించిన పాపాన పోలేదని ఆయన ఆరోపించారు. కొత్త ఉద్యోగాల మాట దేవుడెరుగు కానీ.. ఉన్న ఉద్యోగాలనే చంద్రబాబు ఊడగొడుతూ నిరుద్యోగుల ఉసురు పోసుకుంటున్నారని పానుగంటి విమర్శించారు. వైయస్ జగన్ గారు తన హయాంలో సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థల ద్వారా రాష్ట్రంలో కొత్తగా నాలుగు లక్షల మందికి ఉద్యోగం కల్పించిన వాస్తవాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అంతే కాక స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ ఫైబర్ నెట్, ఆప్కాస్ తదితర సంస్థల సాయంతో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి వారి కుటుంబాలలో పేదరికపు చిమ్మ చీకట్లు పారద్రోలి ప్రగతి కాంతులు నింపారని ఆయన వివరించారు.

అయితే చంద్రబాబు తాను ముఖ్యమంత్రి అయిన వెంటనే వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయడం, ఏపీ ఫైబర్ నెట్ మూసివేయడం, స్కిల్ డెవలప్‌మెంట్, ఆప్కాస్ తదితర సంస్థలను నిర్వీర్యం చేయడం ద్వారా లక్షలాది మంది ఉద్యోగాలు ఊడబీకి వారి కుటుంబాలను బజారు పాల్జేశారని ఆరోపించారు. ఫలితంగానే మన రాష్ట్రం నిరుద్యోగం విషయంలో దేశంలోనే మూడో స్థానానికి ఎగబాకిందని పానుగంటి చైతన్య ధ్వజమెత్తారు. ఇదేదో తాము చెబుతున్న మాట కాదనీ.. స్వయంగా లేబర్ ఫోర్స్ సర్వే నివేదిక వెల్లడించిన నగ్న సత్యమనీ.. ఆయన స్పష్టం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి 29 సంవత్సరాల లోపు యువతీ యువకులలో నిరుద్యోగిత 21శాతంగా ఉన్నట్లు సదరు నివేదిక వెల్లడించిందని ఆయన వివరించారు.

వాస్తవం ఇలా కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంటే.. మాటల్లో తప్ప చేతల్లో విజనరీ లేని వెటరన్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు రెడ్ బుక్ రాజ్యాంగ సృష్టికర్త లోకేష్, ప్రశ్నించడం కోసమే పుట్టానని చెప్పుకోవడమే తప్ప అసలు ప్రశ్నించడమే మానేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాత్రం – తాము విశేష ప్రతిభా పాటవాల కారణంగా రాష్ట్రంలో అనేక కొత్త కంపెనీలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొచ్చాయనీ.. అందరికీ ఉద్యోగాలు కల్పించామనీ.. గొప్పలు చెప్పుకొంటూ గోబెల్స్ ప్రచారం చేసుకుంటున్నారని హేళన చేశారు. ఇది ఖచ్చితంగా యువతను మోసం చేయడమేనని మండిపడ్డారు. ఇప్పటికైనా కల్లబొల్లి కబుర్లు కట్టిపెట్టి యువతకు నిజాయితీగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేసారు. లేని పక్షంలో యువత ఆగ్రహ జ్వాలల్లో కూటమి ప్రభుత్వానికి భవిత లేకుండా పోతుందని పానుగంటి చైతన్య హెచ్చరించారు.

## కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన హోంగార్డులకు ఎస్పీ అభినందనలు




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లాలో హోంగార్డులుగా పనిచేస్తూ పట్టుదలతో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన ఐదుగురిని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు. సోమవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డులు ఆర్ఐ సురేష్ ఆధ్వర్యంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలసి పూలమొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు కృషి, పట్టుదలతో సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారని అన్నారు. ప్రజల రక్షణ కోసం విధులు నిర్వర్తించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. హోంగార్డులుగా పనిచేస్తూ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన వారిలో తాడేపల్లి పోలీస్ స్టేషన్లో పనిచేసిన ఎన్.రవి నెల్లూరు జిల్లాకు, గుంటూరు మోటార్ ట్రాన్స్పోర్ట్ విభాగంలో విధులు నిర్వహించిన వి.రాజు, చి.విజయ్‌కుమార్ గుంటూరు జిల్లాకు, గుంటూరు సౌత్ డీఎస్పీ కార్యాలయంలో పనిచేసిన వి.రాజేష్ పల్నాడు జిల్లాకు, గుంటూరు ట్రాన్స్పోర్ట్ విభాగంలో విధులు నిర్వహించిన చి.ఏడుకొండలు నెల్లూరు జిల్లాకు ఎంపికయ్యారు. హోంగార్డులుగా ప్రారంభించి పట్టుదలతో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడం గర్వకారణమని ఎస్పీ అభిప్రాయపడ్డారు.

## అత్యవసర సమయంలో ఆదుకున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి అనారోగ్యంతో మంగళగిరిలోని ఎయిమ్స్ వైద్యశాల ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతున్న పట్టణానికి చెందిన 16వ సచివాలయ పరిధి నివాసి కోరమట్ల మల్లేశ్వరి కి వృద్ధాప్య పెన్షన్ రూ. 4 వేలు అందజేశారు. మహిళా పోలీస్ ఉద్యోగిని టి. దివ్య వేణి ఆస్పత్రి కి సైతం వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నగదును అందించడం పట్ల బాధితురాలి కుటుంబ సభ్యులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## ఆరుద్ర భూలక్ష్మిని సన్మానించిన జవ్వాది



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియామకమైన ఆరుద్ర భూలక్ష్మిని మంగళగిరి పట్టణంలోని ఎంఎస్ఎస్ భవన్ లో మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ "స్వచ్ఛమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ఆరుద్ర భూలక్ష్మి కీలకపాత్ర పోషిస్తారని, రాష్ట్ర ప్రజలకు మరింత సేవలు అందిస్తారని నమ్ముతున్నాం. మహిళలు ఉన్నత పదవుల్లో రాణించడం సమాజానికి గర్వకారణం" అని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాదాల రమేష్ బాబు, భావన శ్రీనివాసరావు, బొర్రా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


## ఇందిరానగర్ గణనాథుడు అన్నదానం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి ఇందిరానగర్లోని మున్సిపల్ పాఠశాల వద్ద వినాయక చవితి సందర్భంగా ఆరుద్ర సుబ్బారావు, కోగంటి బాబి, మాదల వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు బాల గణపతి విగ్రహ వద్ద జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర పద్మశాలియ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర మిషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, బీజేపీ ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షులు తుళ్ళిమిల్లి రామకృష్ణ, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు మంచికలపూడి వైష్ణవి, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని అనిత హాజరై, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నం నాగబాబు, జొన్నాదుల రామాంజనేయులు, గోసాల రాఘవ, విగ్రహ దాత పాములపాటి శివారెడ్డి, భక్తబృందం ప్రతినిధులు ఆరుద్ర శివాజీ, పాలకాయల అర్జునరావు, బాలకోటయ్య, పోతురాజు వెంకటేశ్వరరావు, ఆరుద్ర సత్యం తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# ఎరువుల అక్రమ విక్రయాలపై ఉక్కుపాదం



- రాష్ట్రమంతటా విజిలెన్స్ బృందాల దాడులు
- 2,845 మెట్రిక్ టన్నుల ఎరువుల స్వాధీనం... 191 కేసులు నమోదు
- ఎవరినీ ఉపేక్షించవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల అక్రమ విక్రయాలు జరగకూడదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల విజిలెన్స్ బృందాలు దాడులు చేశాయి. గతవారం రోజులుగా నిర్వహించిన సోదాల్లో పెద్దఎత్తున ఎరువుల అక్రమ నిల్వలు బయటపడ్డాయి. అలాగే బహిరంగ మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించి కొందరు డీలర్లు అక్రమ విక్రయాలకు పాల్పడుతున్నట్టు దాడుల్లో వెల్లడైంది. ఆగస్ట్ 23 నుంచి ఆగస్ట్ 31 వరకు మొత్తం 286 విజిలెన్స్ బృందాలు 598 దుకాణాల్లో తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా అక్రమంగా విక్రయిస్తున్న రూ. 1.83 కోట్ల విలువైన 934 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్ చేశారు. వారిపై 67 కేసులు నమోదు చేశారు. అలాగే అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 4.30 కోట్ల 1,911 మె.ట. ఎరువుల అమ్మకాలు తాత్కాలికంగా నిలిపివేస్తూ స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి 124 కేసులు నమోదు చేశారు. నిబంధనలు అతిక్రమించిన మరో 8 దుకాణ యజమానులపై క్రిమినల్ కేసులు కూడా పెట్టారు. దీనిపై సోమవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి.., రైతులను ఇబ్బంది పెట్టేలా ఫెర్టిలైజర్ దుకాణదారులు, డీలర్లు నడుచుకుంటే వారిని ఉపేక్షించవద్దని అధికారులకు సూచించారు. అన్నదాతలకు ఎక్కడా ఎరువులు, పురుగుమందుల కొరత రానియొద్దని నిర్దేశించారు.

# విజన్ ఉన్న నాయకుడు సిబిఎన్



- చంద్రబాబు నాయుడు తొలిసారి సీఎంగా ప్రమాణం చేసి 30 ఏళ్లైన సందర్భంగా అభినందనలు
- పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** చంద్రబాబు నాయుడు తొలిసారి సీఎంగా ప్రమాణం స్వీకారం చేసి 30 ఏళ్లైన సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఆయన దూరదృష్టి, కార్యనిర్వహణ, పరిపాలన దక్షత, క్రమశిక్షణ, నిబద్ధత, కృషి అన్ని తరాలకు ఆదర్శనీయమన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కేబినెట్ మంత్రిగా పనిచేయడం గర్వంగా ఉందన్నారు. గొప్ప దార్శనికతతో పాటు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన చంద్రబాబు నాయుడు అమరావతిని రాజధానిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తారని అన్నారు. తెలుగువారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన నాయకుడు చంద్రబాబు అని పేర్కొన్నారు. విజన్ 2020 విజయవంతం చేసి... ఇప్పుడు స్వర్ణాంధ్ర విజన్ 2047కి శ్రీకారం చుట్టారని, పీ4 తో పేదరిక నిర్మూలన చేసేందుకు కృషి చేస్తున్న యజ్ఞంలో తాను భాగస్వామిని అయినందుకు ఆనందంగా ఉందన్నారు. అంతేగాక పాలన సంస్కరణలతో పాటు సాంకేతికతను పరిపాలనలో భాగం చేసి అద్భుత ప్రగతికి మార్గం వేస్తున్న చంద్రబాబు నాయుడుకి ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు తెలిపారు.

# నిర్మల సిబిఎస్ఈ హైస్కూల్లో పదవ తరగతి సర్టిఫికెట్ల గల్లంతు




- సర్టిఫికెట్ల మాయం ఘటనపై విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన
- న్యాయం చేయాలంటూ ఎంఈఓ కార్యాలయానికి చేరుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి మండలం ఆత్మకూరులోని నిర్మల సీబీఎస్ఈ సిలబస్ కు సంబంధించిన పదో తరగతి విద్యార్థుల సర్టిఫికెట్ల గల్లంతు వ్యవహారం వెలుగు చూసింది. 2024-2025 %జదీూజు% సిలబస్ పదవ తరగతి పరీక్షలు రాసిన సుమారు 100 మంది విద్యార్థిని విద్యార్థులకు సంబంధించిన పదవ తరగతి సర్టిఫికెట్లు స్కూల్ నుండి మాయమయ్యాయని విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు

ఈ నేపథ్యంలో మంగళగిరిలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్దకు చేరుకొని తమకు న్యాయం చేయాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు.

ఈ ఏడాది ఇంటర్మీడియట్ విద్యా సంవత్సరం తరగతులు మొదలయి మూడు నెలలు గడుస్తున్నా తమ పిల్లలను కాలేజీలలో జాయిన్ చేసేందుకు కాలేజీల యాజమాన్యాలు, పదవ తరగతి సర్టిఫికెట్ లేకుండా అడ్మిషన్ ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని.. నిర్మల స్కూల్ యాజమాన్య నిర్లక్ష్య ధోరణి కారణంగా తమ పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విలువైన సర్టిఫికెట్ల మాయం ఘటనలో పాఠశాలలోని ఆఫీసు సిబ్బంది హస్తం ఉందని.. ఆఫీసు సిబ్బంది పాఠశాల ప్రతిష్టను దెబ్బతీసేలా ఏదైనా దురుద్దేశంతో కుట్ర పన్నారా? .. లేదా నిర్లక్ష్యంతోనే ఈ నిర్వాకానికి ఒడిగట్టారా? అని విద్యార్థుల తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి తమ భవిష్యత్తును అయోమయానికి గురిచేసిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని, సర్టిఫికెట్లు అందించి న్యాయం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# దేశంలో ఎక్కడా అమలుకాని సంక్షేమం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పంపిణీచేస్తుంది

- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డుదారులు లక్ష 46వేల మంది ఉంటే,వివిధ పథకాల ద్వారా,ఆకుటుంబాలలోని,63 లక్షల మంది లబ్ధిపొందుతున్నారని, దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రజలకు సంక్షేమం పంచుతున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల ఒకటవ తేదీన, ప్రభుత్వ ఉద్యోగులకు జీతం ఇచ్చిన తీరుగా, వృద్ధాప్య,వికలాంగ, వితంతు పెన్షన్లను పంపిణీ చేస్తున్న నేపథ్యంలో, సోమవారం పట్టుబధ్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పట్టణంలోని, 14, 17, 23 వార్డులలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా వార్డులలో వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, ప్రభుత్వం అందించే నాలుగు వేల రూపాయల పెన్షన్ అందజేశారు. 14వ వార్డులోని తెలుగుదేశం నాయకులు వెంటరాగ, పలుచోట్ల పెన్షన్లు అందజేశారు. 17వ వార్డులో వార్డు కౌన్సిలర్ అన్నం పిన్నారావు,మల్లేశ్వరి, వార్డులోని తెలుగుదేశం నాయకులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ వెంట పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. 23వ వార్డులో పెన్షన్ల పంపిణీ తో పాటుగా, క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను కూడా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా సంక్షేమ పథకాలు, ఆంధ్రప్రదేశ్లో అమలవుతున్న తీరుగా అమలు కావడం లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ద్వారా, కూటమి ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువవుతుంటే, ప్రతిపక్ష హోదా లేకపోయినా ప్రతిపక్షమని చెప్పుకొనె,వైసీపీ నాయకులు మాట్లాడే మాటలకు పొంతన లేదన్నారు. కూటమి పార్టీల నాయకత్వంలో, లభించే సంక్షేమ పథకాల తీరును, పరస్పరం ప్రజలు ప్రస్తావించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వ,పార్టీలకు ప్రజలు ఎల్లవేళల అండగా ఉంటారన్న భావనను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మహమ్మద్ కుద్దూస్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్. సాంసోన్, కొండా రమాదేవి,దీవి అనిత,పార్టీలోని పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# గుణగణాలు గల ఈశుడే గణేశుడు : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుణ గణాలు గల ఈశుడే గణేశుడని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. విద్య, వినయం, వివేకం ప్రసాదించే వేలుపు వినాయకుడన్నారు. సమస్త విద్యలకు, సకల కళలకు ఆదిమూలమైన ఆచార్యుడని పేర్కొన్నారు. వేద వేదాంగ వేద్యుడైన వక్రతుండుడని వ్యాఖ్యానించారు.

గుంటూరులోని పలు ప్రాంతాలలో గణేశ ఉత్సవాలు కోలాహలం కొనసాగుతున్నాయి. ఆబాలగోపాలాన్ని అలరించే రీతిలో వెలసిన చలువ పందిళ్ళ వద్ద చవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా చుట్టుగుంటలో దొంతా బ్రహ్మం, కేవీపీ కాలనీలో కార్పొరేటర్ కాంద్రకుంట గురవయ్య ఆధ్వర్యంలో అత్యంత రమణీయంగా రూపొందించిన ప్రత్యేక మండపాలలో కొలువైన గణనాధుల విగ్రహాలను ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి దర్శించుకున్నారు. అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి, అందరికీ శుభాలు కలుగజేయాలని వేడుకున్నారు.

అనంతరం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, వాడవాడలా వైభవోపేతంగా జరుగుతున్న వినాయక చవితి వేడుకలతో సర్వత్రా ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నట్లు చెప్పారు. తద్వారా ప్రతి ఒక్కరిలో ధార్మిక చింతనతో కూడిన సాత్వికత పెంపొందినట్లు ఆయన అభిప్రాయపడ్డారు. సమాజానికి ఇది ఎంతో శుభ పరిణామమని ఆయన పేర్కొన్నారు. ఇదే రీతిన అంతా కలిసి సిద్ధి బుద్ధికి అధిపతి అయిన గణపతిని వేనోళ్ళా స్తుతించి సుఖసంతోషాలను సొంతం చేసుకోవాలని సూచించారు. సర్వవిఘ్నాలనూ హరించి.. సకల జనులపై వరాల జల్లు కురిపించే మహా ఉదారుడైన లంబోదరుడిని అత్యంత భక్తి శ్రద్ధలతో సేవించిన వారికి - తాము తలపెట్టిన మంచి పనులలో ఎదురయ్యే ఆటంకాల తప్పక తొలగిపోతాయని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చుట్టుగుంట మండప నిర్వాహకులు దొంతా బ్రహ్మం, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, రాయపాటి పవన్ కుమార్, మహంకాళి వెంకట్రావు, కేవీపీ కాలనీ మండప నిర్వాహకులు కాంద్రకుంట గురవయ్య, కొండా నాగేశ్వరరావు, తిరుమలేశ్వరరావు, విజయ్, జరపాల సాంబయ్య, కేతావత్ రవీంద్రనాయక్, అనిల్ నాయక్, కోటా వేణుగోపాలరావు, కటకం కోటేశ్వరరావు, పవన్ కుమార్, ప్రేమ్ కుమార్, వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, షేక్ రబ్బానీ, దాసరి గోపి తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు కోసం ఆత్మ బలిదానానికి సిద్ధమవుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

- జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్‌బాష



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సోమవారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్‌బాష మాట్లాడుతూ%ూ% ఉద్యోగులు, ఉపాధ్యాయులపై సిపిఎస్, జిపిఎస్ విధానాలు గుదిబండలుగా మారాయని తీవ్రంగా విమర్శించారు.

"2004లో సిపిఎస్‌ను అమలు చేసి ఉద్యోగుల హక్కులను దోచుకున్నారు. దాన్ని రద్దు చేయమంటే జిపిఎస్ పేరిట మరో కొత్త సమస్య మోపారు. ప్రజాస్వామ్యంలో ఉద్యోగులు 40 ఏళ్లు సేవలు చేస్తారు. కాని వారికి పెన్షన్ లేదు. మరోవైపు ఐదేళ్లు మాత్రమే పనిచేసిన రాజకీయ నాయకులకు మాత్రం పెన్షన్ కల్పిస్తున్నారు" అని చాంద్‌బాష ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా సిపిఎస్, జిపిఎస్‌లపై పునరాలోచించి, ఉద్యోగుల మేలు దృష్ట్యా ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యోగులు ఆత్మబలిదానాలకు కూడా సిద్ధమని హెచ్చరించారు. త్వరలోనే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు భారీ స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, నగర శాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సహాయ అధ్యక్షుడు కొటేశ్వరరావు, శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదరత్తయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, జిల్లా కార్యదర్శి సుమిత్రాదేవి, ఉపాధ్యక్షులు పద్మజ, ఆలీసు, షబానా తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 7వ తేదీ చంద్రగ్రహణం కారణంగా శ్రీశైలం ఆలయ ద్వారాల మూసివేత

**శ్రీశైలం, (జర్నలిస్ట్ ఫైల్):** చంద్రగ్రహణం కారణంగా శ్రీశైలం దేవస్థాన ఆలయ ద్వారాలు మూసివేయబడనున్నాయి. ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 1 గంట నుండి 8వ తేదీ ఉదయం 5 గంటల వరకు ఆలయానికి భక్తులకు ప్రవేశం ఉండదు. సెప్టెంబర్ 7 రాత్రి 9.56 గంటలకు ప్రారంభమై 8వ తేదీ తెల్లవారుజామున 1.26 గంటలకు చంద్రగ్రహణం ముగుస్తుంది. ఈ కారణంగా ఆ రోజున ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలు, పరోక్షసేవలు, స్వామివారి - అమ్మవారి కల్యాణోత్సవం పూర్తిగా రద్దు చేయబడ్డాయి. భక్తులకు కేవలం అలంకార దర్శనం మాత్రమే కల్పించబడుతుంది. సాక్షిగణపతి, హాటకేశ్వరం, ఫాలధార పంచధార, శిఖరేశ్వరం వంటి పరివార దేవాలయాల ద్వారాలు కూడా ఇదే విధంగా మూసివేయబడతాయి. సెప్టెంబర్ 8న ఉదయం 5 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి, ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం స్వామివారి, అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. ఉదయం 7.30 గంటలకు మహామంగళహారతులు జరగనున్నాయి. ఆ సమయం నుండి మధ్యాహ్నం 2.15 వరకు భక్తులకు అలంకార దర్శనం కల్పించబడుతుంది. తరువాత మధ్యాహ్నం 2.15 నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆన్‌లైన్‌లో స్పర్శ దర్శనం, విరామదర్శనం టికెట్లు పొందిన భక్తులకు దర్శనం కల్పిస్తారు. అనంతరం సాయంత్రం 5.30 నుండి రాత్రి 9 గంటల వరకు అలంకార దర్శనం కొనసాగుతుంది. రాత్రి 9 గంటల తరువాత స్పర్శదర్శనం, విరామదర్శనం టికెట్లు పొందిన భక్తులకు దర్శన సౌకర్యం కల్పిస్తారు.

# పోలీసుల దూకుడు...

## ఐదు రోజుల్లోనే అత్తోట దోపిడీ దొంగల అరెస్ట్



- అత్తోట వృద్ధురాలి దోపిడీ కేసు చేధన వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్ కుమార్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఎస్పీ సతీష్ కుమార్ అత్తోట గ్రామంలో వృద్ధురాలిపై దాడి చేసి బంగారం దోచుకెళ్లిన దోపిడీ దొంగల అరెస్టు వివరాలను మీడియాకు వెల్లడించారు.

ఆగస్టు 26న గుంటూరు జిల్లా కొల్లిపర మండలంలోని అత్తోట గ్రామంలో 78 ఏళ్ల బొల్లిముంత బుల్లెమ్మ ఒంటరిగా ఇంట్లో నిద్రిస్తుండగా, ఇద్దరు దుండగులు ఇంట్లోకి చొరబడి ఇనుపరాడ్‌తో తలపై దాడి చేసి, ఆమె ఒంటిపై ఉన్న 160 గ్రాముల బంగారం (విలువ రూ. 13 లక్షలు) దోచుకెళ్లారు. వృద్ధురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు.

తదుపరి దర్యాప్తులో భాగంగా తెనాలి రూరల్ సిఐ ఉమేష్, కొల్లిపర ఎస్సై కోటేశ్వరరావు నేతృత్వంలోని పోలీసులు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ఆ దృశ్యాల్లో ఒక బైక్‌పై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారిని పల్నాడు జిల్లాకు చెందిన కుంచెపు దుర్గాప్రసాద్, కొత్తపల్లి ఎలీషాగా గుర్తించారు. వీరు పశువులు, బైకులు, ఆభరణాలు, విలువైన వస్తువులు దొంగతనం చేయడంలో నైపుణ్యం కలిగినవారిగా, ఇప్పటివరకు 21కి పైగా కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు ఎస్పీ వివరించారు.

దొంగతనంలో వచ్చిన డబ్బును చెడు వ్యసనాలకు ఖర్చు చేస్తూ జీవనాన్ని కొనసాగించిన ఈ దొంగలు, అత్తోట గ్రామంలో కూడా సాధారణ దొంగతనానికి వచ్చి, అక్కడ ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని గమనించి ఆమెపై దాడి చేసి బంగారం దోచుకెళ్లారని ఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి మొత్తం బంగారం రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. ఇదే కేసులో కుంచెపు దుర్గాప్రసాద్ భార్య మున్నంగి ప్రియాంకను కూడా బంగారం దాచిపెట్టడం, కొంత భాగం విక్రయించడంలో సహకరించినందుకు అరెస్ట్ చేశామని వెల్లడించారు.

ఈ కేసును కేవలం ఐదు రోజుల్లోనే చేధించిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు. తెనాలి ఎస్‌డిపిఒ బి. జనార్ధనరావు పర్యవేక్షణలో, తెనాలి రూరల్ సిఐ ఉమేష్, కొల్లిపర ఎస్సై కోటేశ్వరరావు, తెనాలి రూరల్ ఎస్సై ఆనంద్, ఏఎస్సై పోతురాజు, హెడ్ కానిస్టేబుల్ రామ కోటేశ్వరరావు, కానిస్టేబుల్ రామకృష్ణ, మహిళా కానిస్టేబుల్ హామీమ్ లు కీలక పాత్ర పోషించినట్లు వివరించారు. వారికి అభినందనలు తెలుపుతూ ప్రశంసా పత్రాలు అందజేశారు.

ప్రజల భద్రత కోసం జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటు కొనసాగుతోందని, ప్రతి ఇంటి వద్ద, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సతీష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సీసీ కెమెరాల వల్లే ఈ కేసు సులభంగా చేధించగలిగామని, నేర నియంత్రణలో వాటి ప్రాముఖ్యత ఎంతగానో ఉందని ఎస్పీ స్పష్టం చేశారు.

# సీఎం చంద్రబాబు నాయుడు దార్శనికుడు, అలుపెరుగని శ్రామికుడు

- చంద్రబాబు రాజకీయ జీవితంలో అత్యంత చిరస్మరణీయ ఘట్టం ఈ రోజు సంభవించింది
- తొలిసారిగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నేటితో 30 ఏళ్లు
- చంద్రబాబు ముందుచూపుతోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడిచింది
- ఏపి అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం
- శుభాకాంక్షలు తెలిపిన వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అభివృద్ధి, ఆధునికత, దూరదృష్టి అనే పదాలను పరిచయం చేసిన గొప్ప నాయకుడు చంద్రబాబు నాయుడు అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ సీఎం చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితాన ఒక కీలక ఘట్టమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఈ రోజుతో ఆయన తొలిసారిగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు సీఎం చంద్రబాబు కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతు సంక్షేమం, పల్లె ప్రగతి, పౌరసదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధి అన్నీ చంద్రబాబు పాలనలో కొత్త ఊపును పొందాయని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిపాలనలోకి తీసుకురావడం ద్వారా గుడ్ గవర్నెన్స్ కు నాంది పలికిన దూరదృష్టి గల నాయకుడు సీఎం చంద్రబాబు అని కొనియాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ, రాష్ట్ర భవిష్యత్తు కోసం పగలు రాత్రి కృషి చేసే ఆయన నిజమైన ప్రజానాయకుడు అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు హైదరాబాద్ నగరాన్ని ఐటీ రంగంలో దేశానికే ఆదర్శంగా నిలబెట్టారని తెలిపారు. నాటి నుంచి నేటి వం-కూ అలుపెరుగని శ్రామికుడిగా ఆయన పనిచేస్తూ, చేయిస్తూ, ఉమ్మడి ఆంధ్రాలోనూ, నవ్యాంధ్రలోనూ చెరగని ముద్ర వేశారని, ముఖ్యంగా ఆయన దార్శనికత, పాలన విషయంలో ఉండే నిబద్ధత అన్నవి ఇప్పటి నాయకులకు, తన రాజకీయ జీవితానికి ఆయనొక స్ఫూర్తి అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పాలన పరంగా సంస్కరణలు అమలు చేసి గొప్ప విజన్ ఉన్న నేతగా ఆయన పేరు చరిత్రలో నిలిచి పోయిందన్నారు. ఆయన చేసిన సంక్షేమానికి ఆయనంటే పడని వారు కూడా మెచ్చుకోకుండా ఉండలేరని తెలిపారు. నాడు ఆయన తీసుకువచ్చిన సంస్కరణలే అందుకు గొప్ప ఉదాహరణలను అని, సైబరాబాద్ నిర్మాణం, ఐటీ రంగం , ముఖ్యంగా భాగ్యనగర అభివృద్ధి తదితర పనులపై ఆయన చిర స్థాయిలో చెరగని ముద్ర వేశారని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో వేగవంతంగా పనులు అయ్యేందుకు ఇ గవర్నెన్స్ ను తీసుకుని వచ్చి అమలు చేసిన వైనం మరువలేమని, ఇప్పటికి ఆయన నవ యువకుడిగానే ఉంటారని అన్నారు. ఆయనతో పరుగులు తీయడం అంటే నిరంతరం ఏదో ఒక కొత్త విషయం నేర్చుకునే తీరాలని, టెక్నాలజీ విషయమై ఆయన ఎప్పటికప్పుడు ముందుంటారని పేర్కొన్నారు. ఇవాళ హైదరాబాద్ విశ్వనగరిగా ఎంతో పేరు తెచ్చుకుందంటే ఆ రోజు అలుపెరుగని శ్రామికుడిగా చంద్రబాబు చేసిన కృషే కారణం అని అన్నారు. ముఖ్యంగా రేపటిని అంచనా వేయడం, అవకాశాలను సృష్టించేందుకు ప్రాధాన్యం ఇవ్వడం, ప్రతి ఒక్కరినీ కలుపుకుని పోయే విధంగా నాయకత్వం ఉండడం.. కళ్లెదుట నిలిచే దృశ్యాలు. నిరంతరం ఆయన చేసిన అభివృద్ధి చూస్తేనే ఆయన మాట వింటేనే ఓ స్ఫూర్తి అని తెలిపారు. రాష్ట్ర రాజకీయాలలోనే కాదు దేశ రాజకీయాలలో కూడా ఆయన స్థానం గొప్పదని, ఎందరికో రాజకీయ అవకాశాలు ఇచ్చిన మహా నేత అని అన్నారు. తెలుగు దేశం పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ, పార్టీనీ ప్రభుత్వాన్నీ ఏకతాటిపై నడిపే సత్తా ఆయన ఒక్కరికే సొంతమన్నారు. ముఖ్యంగా విపత్తుల సమయంలో ప్రజలకు చేయాల్సిన సేవ నిర్వహణలో, తీవ్ర తుఫానుల సమయంలో ఆయన నిద్ర లకుండా పనిచేశారని, నాయకులతో, అధికారులతో ఒకే నిబద్ధతతో పనిచేయిస్తారని అన్నారు. అసలు నా వల్ల కాదు అన్న మాట ఆయన నోటి నుంచి వినమని, అంతగా పార్టీ కోసం కానీ ప్రజల కోసం కానీ రాష్ట్ర ప్రగతి విషయంలో కానీ ప్రతిరోజూ అంకిత భావంతో పనిచేయడం ఆయనొక్కరికే సుసాధ్యం అని తెలిపారు. నేడు నవ్యాంధ్రుల రాజధాని అమరావతి నిర్మాణంలోనూ, సంబంధిత డిజైన్ల రూపకల్పనలోనూ ఆయన చూపే చొరవ శ్రద్ధ అపూర్వం, అద్వితీయం. విశాఖ కేంద్రంగా ఐటీ సెక్టార్ ను డెవలప్ చేసే క్రమంలో ఆయన ఎన్నో ప్రపంచ ప్రసిద్ధ కంపెనీలను సమన్వయం చేస్తూ పనిచేస్తున్నారు. ఆ రోజు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో హైదరాబాద్ కేంద్రంగా జీనోమ్ వ్యాలీ తీసుకుని వస్తే, ఇవాళ అమరావతి కేంద్రంగా క్వాంటం వ్యాలీని తీసుకుని వచ్చేందుకు సంబంధిత పనులు వేగవంతం చేసేందుకు అలుపన్నది లేకుండా కృషి చేస్తున్నారని అన్నారు. అలానే విశాఖ నగరాన్ని మరో సైబరాబాద్ గా, మరో హైటెక్ సిటీగా మారుస్తూ.. ప్రపంచ ప్రసిద్ధ కంపెనీలను తీసుకుని వస్తున్నారు. ఇదంతా ఆయన విజన్ వలనే సాధ్యమైందన్నారు. ఆయన గొప్ప సంకల్పానికి నిదర్శనం ఆయన జీవితం అని, ఓ సాధారణ కుటుంబం నుంచి వచ్చి దేశం గర్వించదగ్గ నేతగా ఎదగడం అన్నది ఆయనకే సాధ్యమని తెలిపారు. రేపటి తరానికి ఆయన రాజకీయ జీవితం ఓ స్ఫూర్తి పాఠమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467